


PRGI NO: TGTEL/25/A5314

# అర్జున్ సమాచారం

www.arjunsamaachaaram.in


తెలుగు దినపత్రిక

ఎడిటర్ : లింగం రాజయ్య

బ్యూరో చీఫ్ : గిరవెన రాకేష్




నల్లగొండ హైదరాబాద్ రంగారెడ్డి | epaper.arjunsaamaachaaram.com | మంగళవారం 07, జులై 2026 | సంపుటి :1 సంచిక : 185 | పేజీలు : 8 , వెల.2.00



## ధైర్యానికి శాశ్వత నిదర్శనం.. శ్యామా ప్రసాద్ ముఖర్జీకి ప్రధాని మోదీ నివాళి..

భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఘనంగా నివాళులర్పించారు. దేశ సమైక్యత కోసం ఆయన చేసిన త్యాగం, ప్రజాసేవ పట్ల చూపిన అంకితభావం తరతరాలకు ఆదర్శంగా నిలుస్తాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఆయన జీవితం 'ధైర్యానికి, మాతృభూమి పట్ల అచంచలమైన నిబద్ధతకు కాలాతీత ఉదాహరణ' అని కొనియాడారు.

2



## పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు కీలక చర్యలు

- దుర్గం చెరువును పూర్తి స్థాయి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలి
- మంజీరా, దిల్‌కుషా గెస్ట్ హౌస్‌లను ఆధునికీకరించాలి
- టూరిజం హబ్ డెవలప్‌మెంట్ పథకం కింద వికారాబాద్ అభివృద్ధి
- గుర్రంగూడ ఎకో పార్క్ తరహాలో భాగ్యనగరంలో ఎకో పార్కులు..
- ఫ్యూచర్ సిటీలోని అటవీ భూములను అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దాలి
- పర్యాటక ప్రాంతాల అభివృద్ధిపై సీఎం రేవంత్ కీలక ఆదేశాలు..

తెలంగాణ పర్యాటక శాఖపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టి సారించారు. రాష్ట్రంలో పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు కీలక చర్యలు చేపట్టారు. ఈ మేరకు జూబ్లీహిల్స్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రం క్యాంపస్‌లో సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పర్యాటక ప్రాంతాల అభివృద్ధిపై వారికి కీలక సూచనలు చేశారు. ముఖ్యంగా హైదరాబాద్‌లోని పర్యాటక ప్రాంతాలపై ఫుల్ ఫోకస్ పెట్టారు ముఖ్యమంత్రి. గొల్కొండ సమీపంలోని తారామతి బారాదరిని టూరిజం ప్రాంతంగా మరింత అభివృద్ధి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. దుర్గం చెరువును పూర్తి స్థాయి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు.

మంజీరా, దిల్‌కుషా గెస్ట్ హౌస్‌లను ఆధునికీకరించాలని ఆదేశించారు. టూరిజం హబ్ డెవలప్‌మెంట్ పథకం కింద వికారాబాద్‌ను అభివృద్ధి చేయాలన్నారు. వికారాబాద్‌లోని వీరభద్రస్వామి దేవాలయాన్ని డెవలప్ చేసి యాదాద్రి తరహాలో ఆలయానికి కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. క్యూర్ పరిధిలోని అటవీ శాఖ భూములను పర్యాటక శాఖతో కలిసి ఎకో టూరిజంగా అభివృద్ధి చేయాలని సీఎం రేవంత్ ఆదేశించారు.



## ఫిఫా ప్రపంచ కప్: ట్రంప్ జోక్యం.. యూఎస్ ప్లేయర్‌పై నిషేధం ఎత్తివేత!

ఫిఫా ప్రపంచ కప్ 2026లో రౌండ్ ఆఫ్ 32లో జరిగిన మ్యాచ్‌లో అమెరికా ఫుట్‌బాలర్ ఫోలారిన్ బలోగన్‌పై రిఫరీ రెడ్ కార్డ్ చూపించారు. దీంతో బెల్జియంతో జరిగే మ్యాచ్‌కు అతడిపై నిషేధం పడింది. అయితే బలోగన్‌పై ఉన్న ఒక మ్యాచ్ నిషేధాన్ని ఫిఫా ఎత్తివేయడం ఇప్పుడు తీవ్ర వివాదానికి దారితీసింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నేరుగా ఫిఫా అధ్యక్షుడు జియానీ ఇన్ఫాంటినోతో ఫోన్‌లో మాట్లాడిన తర్వాతే ఈ నిర్ణయం వెలువడిందన్న వార్తలు ప్రపంచ ఫుట్‌బాల్ వర్గాల్లో సంచలనం సృష్టించాయి.

2


2 లో..

## కాళేశ్వరం పేరుతో కేటీఆర్ డ్రామాలు చేస్తున్నారు..



మాజీ మంత్రి కేటీఆర్‌పై మంత్రి సీతక్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం పేరుతో ఆయన డ్రామాలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఈరోజు (సోమవారం) మహబూబాబాద్‌లో పర్యటించి, పలు కార్యక్రమాల్లో మంత్రి సీతక్క పాల్గొన్నారు.

2



## సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసు.. అల్లుఅర్జున్ వర్చువల్ హాజరుకు కోర్టు అనుమతి

వార్త 2లో

## రాజకీయంగా ఎదిగేందుకు రాముని పేరు వాడుకున్నారు..



శ్రీరామునికి రామ జన్మభూమిలో రామ మందిరం నిర్మాణానికి ప్రజలు ఎవరి స్థితికి తగ్గట్టు వారు విరాళాలు ఇచ్చారని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈరోజు(సోమవారం) మీడియాతో మాట్లాడుతూ.. విరాళాల్లో కోట్ల రూపాయలు అవినీతి జరిగిందని ఆరోపించారు. బీజేపీ నాయకులు.. రాముని పేరుతో, అక్షింతలపై విరాళాలు అడుక్కున్నారని విమర్శించారు.

2



2

## ఆ ముగ్గురు గ్రేట్ సైంటిస్టులకు ఘన నివాళి.. అంతరిక్షంలోకి సూక్ష్మ విగ్రహాలు..

భారతదేశానికి చెందిన ప్రముఖ ప్రైవేట్ స్పేస్ స్టార్టప్ 'స్కైరూట్ ఏరోస్పేస్' చరిత్రాత్మక అంతరిక్ష ప్రయోగానికి సిద్ధమైన సంగతి తెలిసిందే. స్కైరూట్ సంస్థ ఈ నెలలో 'మిషన్ ఆగమన్' పేరిట 'విక్రమ్-X' రాకెట్‌ను శ్రీహరికోట నుంచి అంతరిక్షంలోకి పంపనుంది.

## గంజాయి రవాణా అరికట్టేందుకు కార్యాచరణ: డీజీపీ సీవీ ఆనంద్

రాష్ట్రంలో గంజాయి రవాణాను అరికట్టేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నాం అని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని మణుగూరులో నూతన పోలీస్ స్టేషన్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. ప్రతి పోలీస్ అధికారి డ్రగ్స్‌పై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.



2

## కన్నెపల్లి వద్ద లక్ష క్యూసెక్కుల నీళ్లు సముద్రంలో కలుస్తున్నాయి: కెటీఆర్



2

# పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు కీలక చర్యలు

**దుర్గం చెరువును పూర్తి స్థాయి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలి**

**మంజీరా, దిల్‌కుషా గెస్ట్ హౌస్‌లను ఆధునికీకరించాలి**

**టూరిజం హబ్ డెవలప్‌మెంట్ పథకం కింద వికారాబాద్ అభివృద్ధి**

**గుర్రంగూడ ఎకో పార్క్ తరహాలో భాగ్యనగరంలో ఎకో పార్కులు..**

**ఫ్యూచర్ సిటీలోని అటవీ భూములను అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దాలి**

**పర్యాటక ప్రాంతాల అభివృద్ధిపై సీఎం రేవంత్ కీలక ఆదేశాలు..**



హైదరాబాద్: అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

తెలంగాణ పర్యాటక శాఖపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టి సారించారు. రాష్ట్రంలో పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేసేందుకు కీలక చర్యలు చేపట్టారు. ఈ మేరకు జూబ్లీహిల్స్‌లోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల కేంద్రం క్యాంపస్‌లో సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా పర్యాటక ప్రాంతాల అభివృద్ధిపై వారికి కీలక సూచనలు చేశారు. ముఖ్యంగా హైదరాబాద్‌లోని పర్యాటక ప్రాంతాలపై ఫుల్ ఫోకస్ పెట్టారు ముఖ్యమంత్రి. గొల్కొండ సమీపంలోని తారామతి బారాదరిని టూరిజం ప్రాంతంగా మరింత అభివృద్ధి చేయాలని సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. దుర్గం చెరువును పూర్తి స్థాయి పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని ఆదేశించారు. మంజీరా, దిల్‌కుషా గెస్ట్ హౌస్‌లను ఆధునికీకరించాలని ఆదేశించారు. టూరిజం హబ్ డెవలప్‌మెంట్ పథకం కింద వికారాబాద్‌ను అభివృద్ధి చేయాలన్నారు. వికారాబాద్‌లోని వీరభద్రస్వామి దేవాలయాన్ని డెవలప్ చేసి యాదాద్రి తరహాలో ఆలయానికి కమిటీ ఏర్పాటు చేయాలని సూచించారు. క్యూర్ పరిధిలోని అటవీ శాఖ భూములను పర్యాటక శాఖతో కలిసి ఎకో టూరిజంగా అభివృద్ధి చేయాలని సీఎం రేవంత్ ఆదేశించారు. గుర్రంగూడ ఎకో పార్క్ తరహాలో భాగ్యనగరంలో ఎకో పార్కులను తీర్చిదిద్దాలని ఆజ్ఞాపించారు. ఫ్యూచర్ సిటీలోని అటవీ భూములను అంతర్జాతీయ స్థాయిలో తీర్చిదిద్దాలన్నారు. అర్బన్ ఫారెస్ట్ తరహాలో ఏర్పాట్లు చేయాలని, ఆ ప్రాజెక్టుల కోసం ప్రత్యేక అధికారిని నియమించి పనులను ముమ్మరం చేయాలన్నారు. పురానాపూల్ హెరిటేజ్ బ్రిడ్జిలను అభివృద్ధి చేసి పర్యాటక ప్రాంతాలుగా తీర్చిదిద్దాలని, బ్రిడ్జిలపై పర్యాటకుల కోసం ఏర్పాట్లు చేయాలని సూచించారు. అవకాశం ఉంటే ట్రాఫిక్‌ను మళ్లించి పర్యాటకులకు అవకాశం కల్పించాలన్నారు ముఖ్యమంత్రి. డిసెంబరులో నిర్వహించే గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌పైనా కసరత్తు ప్రారంభించాలని, సమ్మిట్ కోసం శాఖల మధ్య సమన్వయం కోసం కమిటీలు ఏర్పాటు చేయాలన్నారు. కాగా, ఈ సమీక్షా సమావేశానికి సీఎం సలహాదారు రామకృష్ణారావు, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేశ్ రంజన్, సీఎంవో ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్, టూరిజం సెక్రటరీ వాణి ప్రసాద్, టూరిజం కార్పొరేషన్ ఎండీ గౌతమి హాజరయ్యారు.

## ధైర్యానికి శాశ్వత నిదర్శనం.. శ్యామా ప్రసాద్ ముఖర్జీకి ప్రధాని మోదీ నివాళి..

హైదరాబాద్: అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఘనంగా నివాళులర్పించారు. దేశ సమైక్యత కోసం ఆయన చేసిన త్యాగం, ప్రజాసేవ పట్ల చూపిన అంకితభావం తరతరాలకు ఆదర్శంగా నిలుస్తాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఆయన జీవితం 'ధైర్యానికి, మాతృభూమి పట్ల అచంచలమైన నిబద్ధతకు కాలాతీత ఉదాహరణ' అని కొనియాడారు. ప్రధాని మోదీ తన బ్లాగ్‌లో శ్యామా ప్రసాద్ ముఖర్జీ జీవిత విశేషాలను ప్రస్తావించారు. శ్యామా ప్రసాద్ సంపన్న కుటుంబంలో జన్మించినప్పటికీ, దేశసేవనే జీవిత లక్ష్యంగా ఎంచుకున్నారని చెప్పారు. వలస పాలన, విభజన రాజకీయాలు, సామాజిక సవాళ్ల వంటి అంశాలపై ఆయన రాజీపడకుండా పోరాడారని గుర్తు చేశారు. దేశ సమైక్యతే శ్యామా ప్రసాద్ ముఖర్జీ ప్రజాజీవితానికి మూల సూత్రమని ప్రధాని అన్నారు. దేశ విభజన సమయంలో పశ్చిమ బెంగాల్ భారతదేశంలోనే కొనసాగడంలో ఆయన కీలక పాత్ర పోషించారని, అనంతరం జమ్మూ కశ్మీర్ సంపూర్ణ విలీనానికి కృషి చేస్తూ నిర్బంధంలోనే ప్రాణాలు కోల్పోయారని పేర్కొన్నారు. జమ్మూ కశ్మీర్‌కు ప్రత్యేక హోదా కల్పించిన రాజ్యాంగంలోని ఆర్టికల్ 370, 35ఏలను 2019లో తమ ప్రభుత్వం రద్దు చేసిందని, అది శ్యామా ప్రసాద్ ముఖర్జీ ఆశయాలకు నిజమైన నివాళి అని ప్రధాని మోదీ అభివర్ణించారు. అలాగే కలకత్తా విశ్వవిద్యాలయానికి అత్యంత పిన్న వయసులో వైస్ ఛాన్సలర్‌గా బాధ్యతలు చేపట్టిన శ్యామా ప్రసాద్.. పరిశోధన, గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. స్వతంత్ర భారత తొలి పరిశ్రమల మంత్రి అయిన శ్యామా ప్రసాద్ ముఖర్జీ, దామోదర్ వ్యాలీ కార్పొరేషన్, సింద్రి ఎరువుల కర్మాగారం వంటి కీలక ప్రాజెక్టులకు పునాది వేశారని ప్రధాని గుర్తు చేశారు.

## ఫిఫా ప్రపంచ కప్: ట్రంప్ జోక్యం.. యూఎస్ ప్లేయర్‌పై నిషేధం ఎత్తివేత!

ఇంటర్నెట్ డెస్క్: అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

ఫిఫా ప్రపంచ కప్ 2026లో రౌండ్ ఆఫ్ 32లో జరిగిన మ్యాచ్‌లో అమెరికా ఫుట్‌బాలర్ పోలారిన్ బలోగన్‌పై రిఫరీ రెడ్ కార్డ్ చూపించారు. దీంతో బెల్జియంతో జరిగే మ్యాచ్‌కు అతడిపై నిషేధం పడింది. అయితే బలోగన్‌పై ఉన్న ఒక మ్యాచ్ నిషేధాన్ని ఫిఫా ఎత్తివేయడం ఇప్పుడు తీవ్ర వివాదానికి దారితీసింది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నేరుగా ఫిఫా అధ్యక్షుడు జియానీ ఇన్ఫాంటినోతో ఫోన్‌లో మాట్లాడిన తర్వాతే ఈ నిర్ణయం వెలువడిందన్న వార్తలు ప్రపంచ ఫుట్‌బాల్ వర్గాల్లో సంచలనం సృష్టించాయి. దీంతో క్రీడల్లో రాజకీయ జోక్యంపై పలువురు విమర్శలు చేస్తున్నారు. అమెరికా ప్రభుత్వానికి చెందిన ఓ అధికారి ఈ విషయంపై మాట్లాడారు. 'బలోగన్‌కు రెడ్ కార్డు ఎందుకు ఇచ్చారు? ఎందుకు సస్పెన్షన్ విధించారు? అనే అంశంపై అధ్యక్షుడు ట్రంప్ ఫిఫా అధ్యక్షుడు ఇన్ఫాంటినోతో మాట్లాడారు. అనంతరం అప్పీల్ ప్రక్రియలో అమెరికా ప్రభుత్వం అదనపు ఆధారాలు సమర్పించింది. స్వతంత్ర కమిటీ వాటిని పరిశీలించి తుది నిర్ణయం తీసుకుంది' అని వెల్లడించారు. బోస్నియా-హెర్జెగొవినాపై జరిగిన గ్రూప్ మ్యాచ్‌లో 64వ నిమిషంలో ప్రత్యర్థిని కాలుతో అడ్డుకున్నందుకు బలోగన్‌కు రిఫరీ రెడ్ కార్డు చూపించారు. సాధారణంగా రెడ్ కార్డ్ అందుకున్న ప్లేయర్ ఒక మ్యాచ్ నిషేధం ఎదుర్కొవాల్సి ఉంటుంది. అయినప్పటికీ ఫిఫా క్రమశిక్షణ కమిటీ ఆ సస్పెన్షన్‌ను అమలు చేయకుండా నిలిపివేసింది. ఈ మేరకు అధికారికంగా ఆ విషయాన్ని ధ్రువీకరించింది. దీంతో బెల్జియంతో జరిగే ప్రిక్వార్టర్స్ మ్యాచ్‌కు బలోగన్ అందుబాటులోకి వచ్చాడు. ఇప్పటికే ఈ ప్రపంచ కప్‌లో మూడు గోల్స్ చేసిన అతడు.. అమెరికాలో కీలక ఆటగాడిగా కొనసాగుతున్నాడు.

**ఫిఫాకు ధన్యవాదాలు: ట్రంప్**

బలోగన్‌పై నిషేధం ఎత్తివేయగానే అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సోషల్ మీడియా వేదికగా స్పందించారు. 'సరైన నిర్ణయం తీసుకున్నారు. ప్లేయర్‌కు అన్యాయం జరగకుండా చూసిన ఫిఫాకు ధన్యవాదాలు' అని ఎక్స్‌లో పేర్కొన్నారు. అయితే ఫిఫా నిర్ణయంపై బెల్జియం ఫుట్‌బాల్ సమాఖ్య తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. నిబంధనలను తప్పుగా అమలు చేశారని ఆరోపిస్తూ అన్ని న్యాయపరమైన అవకాశాలను పరిశీలిస్తున్నట్లు వెల్లడించింది. నార్వే ప్రధాన కోచ్ స్టాలే సోల్‌బక్కెన్ కూడా ఫిఫాపై తీవ్ర విమర్శలు గుప్పించాడు. 'రెడ్ కార్డు ఇచ్చారు.. వీఏఆర్ కూడా దానిని సమర్థించింది. అలాంటప్పుడు ఒక మ్యాచ్ నిషేధం తప్పనిసరి. ఇప్పుడు దాన్ని రద్దు చేయడం పెద్ద తప్పు. అమెరికా గెలిచినా ఈ వివాదం వారి విజయంపై నీడలా వెంటాడుతుంది. ఇకపై ప్రతి రెడ్ కార్డుపైనా రాజకీయ ఒత్తిడి వస్తే పరిస్థితి ఏమిటి? ఇది ప్రపంచ కప్ ప్రతిష్ఠను దెబ్బతీసే నిర్ణయం' అని సోల్‌బక్కెన్ మండిపడ్డాడు.

## ఆ ముగ్గురు గ్రేట్ సైంటిస్టులకు ఘన నివాళి.. అంతరిక్షంలోకి సూక్ష్మ విగ్రహాలు..

ఇంటర్‌నెట్ డెస్క్: అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

భారతదేశానికి చెందిన ప్రముఖ ప్రైవేట్ స్పేస్ స్టార్టప్ 'స్కైరూట్ ఏరోస్పేస్' చరిత్రాత్మక అంతరిక్ష ప్రయోగానికి సిద్ధమైన సంగతి తెలిసిందే. స్కైరూట్ సంస్థ ఈ నెలలో 'మిషన్ ఆగమన్' పేరిట 'విక్రమ్-×' రాకెట్‌ను శ్రీహరికోట నుంచి అంతరిక్షంలోకి పంపనుంది. ఈ ప్రయోగం ద్వారా స్కైరూట్ సంస్థ దేశానికి చెందిన ముగ్గురు గొప్ప సైంటిస్టులకు ఘన నివాళి తెలపడానికి సిద్ధమైంది. 'విక్రమ్-×' రాకెట్‌లో సర్ సీవీ రామన్, డాక్టర్ విక్రమ్ సారాభాయ్, డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాంల సూక్ష్మ విగ్రహాలను అంతరిక్షంలోకి పంపనుంది. మైక్రో ఆర్టిస్ట్ అజయ్ కుమార్ మట్టెవాడ 18 క్యారెట్ల బంగారంతో ఒక చిన్న రాకెట్ ఆకృతిని తయారు చేసి.. అందులో ఈ



ముగ్గురు సైంటిస్టుల విగ్రహాలను చెక్కారు. ఈ విగ్రహాలు ఒక్కోటి బియ్యపు గింజ కంటే చాలా చిన్నవిగా ఉంటాయి. భారతదేశాన్ని అంతరిక్ష రంగంలో సూపర్ పవర్‌గా నిలిపిన ఆ ముగ్గురు మహానుభావుల గౌరవార్థం స్కైరూట్ ఈ వినూత్న ప్రయత్నం చేస్తోంది. ముగ్గురు సైంటిస్టుల సూక్ష్మ విగ్రహాలతో పాటు భారతదేశానికి చెందిన ప్రముఖ ల్యాబ్ గ్రోన్ డైమండ్ జ్యువెలరీ బ్రాండ్ తయారు చేసిన 'కాస్మిక్ బ్లూమ్' కళాఖండం కూడా అంతరిక్షంలోకి ప్రయాణించనుంది.

## కాళేశ్వరం పేరుతో కేటీఆర్ డ్రామాలు చేస్తున్నారు.. మంత్రి సీతక్క ఎద్దేవా

మహబూబాబాద్, అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

మాజీ మంత్రి కేటీఆర్‌పై మంత్రి సీతక్క తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కాళేశ్వరం పేరుతో ఆయన డ్రామాలు చేస్తున్నారని ఎద్దేవా చేశారు. ఈరోజు (సోమవారం) మహబూబాబాద్‌లో పర్యటించి, పలు కార్యక్రమాల్లో మంత్రి సీతక్క పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. కేటీఆర్‌కు అధికార దాహమే తప్ప... ప్రజలపై ప్రేమ లేదని విమర్శించారు. పదేళ్లు అధికారంలో ఉండి ఆయన ఏం చేశారని మంత్రి ప్రశ్నించారు. కాళేశ్వరం కట్టింది.. కూలిపోయింది బీఆర్ఎస్ హయాంలోనే అని ప్రస్తావించారు. కాళేశ్వరం పేరుతో లక్షన్నర కోట్లను వృథా చేశారని ఆరోపించారు. మళ్లీ అధికారం కావాలంటున్నారని.. ఆ ప్రాజెక్టులో నీటిని నిల్వచేస్తే పరివాహక గ్రామాలన్నీ కొట్టుకుపోవాలని కేటీఆర్ చూస్తున్నారా..? అని మంత్రి సీతక్క ప్రశ్నించారు.

## సంధ్య థియేటర్ తొక్కిసలాట కేసు.. అల్లుఅర్జున్ వర్చువల్ హాజరుకు కోర్టు అనుమతి

హైదరాబాద్, అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

సంధ్య థియేటర్ తొక్కిసలాట ఘటనపై ఈరోజు(సోమవారం) నాంపల్లి కోర్టులో విచారణ జరిగింది. ఈ సందర్భంగా టాలీవుడ్ హీరో అల్లుఅర్జున్‌కు వర్చువల్‌గా అటెండ్ అయ్యేందుకు న్యాయస్థానం అనుమతి ఇచ్చింది. అల్లుఅర్జున్ ముంబై షూటింగ్‌లో ఉండడంతో వర్చువల్‌గా హాజరయ్యేందుకు కోర్టు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే ఈ కేసులో నిందితులు కొంతమంది వ్యక్తిగత కారణాలతో విచారణకు హాజరుకాలేదు. దీంతో తదుపరి విచారణను కోర్టు ఈనెల(జులై) 29కి వాయిదా వేసింది. ఈ కేసులో 23 మంది నిందితులకు సంబంధించి 500 పేజీల ఛార్జ్‌షీట్ కాపీలను కోర్టుకు పీపీ అందజేశారు. ఈ కేసుకు సంబంధించి గత విచారణలోనూ అల్లుఅర్జున్ వర్చువల్‌గా అటెండ్ అయిన విషయం తెలిసిందే. ఈరోజు విచారణకు సంబంధించి కోర్టుకు వ్యక్తిగతంగా హాజరుకావాల్సిందిగా అర్జున్‌కు పోలీసులు నోటీసులు ఇచ్చారు. అయితే అర్జున్ షూటింగ్స్‌లో బిజీగా ఉన్నారని, ముంబైలో ఉన్నందుకు వర్చువల్‌గా విచారణకు హాజరయ్యేందుకు అనుమతి ఇవ్వాలని ఆయన తరఫు న్యాయవాది కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇందుకు కోర్టు అనుమతించింది.

## రాజకీయంగా ఎదిగేందుకు రాముని పేరు వాడుకున్నారు..

**బీజేపీపై పొన్నం ప్రభాకర్ ఆగ్రహం**

సిద్దిపేట,

శ్రీరామునికి రామ జన్మభూమిలో రామ మందిరం నిర్మాణానికి ప్రజలు ఎవరి స్థితికి తగ్గట్టు వారు విరాళాలు ఇచ్చారని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈరోజు(సోమవారం) మీడియాతో మాట్లాడుతూ.. విరాళాల్లో కోట్ల రూపాయలు అవినీతి జరిగిందని ఆరోపించారు. బీజేపీ నాయకులు.. రాముని పేరుతో, అక్షింతలపై విరాళాలు అడుక్కున్నారని విమర్శించారు. బీజేపీ నాయకుల అవినీతిని గుర్తించి అయోధ్య ప్రజలే ఆ పార్టీ ఎంపీని ఓడించారన్నారు. ఈ విషయంలో బీజేపీ స్పందించి.. దేశ ప్రజలందరికీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. రాజకీయంగా ఎదగడానికి రాముని పేరును కమలం పార్టీ వాడుకుందని ఆరోపించారు. రాజకీయం వేరు, భక్తి వేరని మంత్రి తెలిపారు. ఈ విషయంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, అమిత్ షా, యూపీ ముఖ్యమంత్రిదే బాధ్యత అని అన్నారు. రాముడి హుండీలోని విరాళాలను ఎత్తుకెళ్లడం దేశ ప్రజలకు అవమానకరమన్నారు. భక్తి పేరుతో, రాముని పేరుతో రాజకీయం చేసే వారి రంగును ప్రజలు గుర్తించాలని తెలిపారు. దేవుడి పేరుపై బీజేపీ స్కాం చేసిందని మంత్రి పొన్నం ప్రభాకర్ విమర్శించారు.

## గంజాయి రవాణా అరికట్టేందుకు కార్యాచరణ: డీజీపీ సీవీ ఆనంద్

మణుగూరు, : అర్జున్ సమాచారమ్ ప్రతినిధి

రాష్ట్రంలో గంజాయి రవాణాను అరికట్టేందుకు కార్యాచరణ రూపొందిస్తున్నాం అని తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ తెలిపారు. సోమవారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని మణుగూరులో నూతన పోలీస్ స్టేషన్‌ను ఆయన ప్రారంభించారు. అనంతరం డీజీపీ సీవీ ఆనంద్ మాట్లాడుతూ.. ప్రతి పోలీస్ అధికారి డ్రగ్స్‌పై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. గంజాయి పెంచే వారిని తీవ్రవాదుల కంటే ఎక్కువగా పరిగణిస్తామని హెచ్చరించారు. ప్రజలకు మంచి సేవలు అందించాలని ఈ సందర్భంగా పోలీసులకు ఆయన సూచించారు. ప్రజలకు ఆటంకం కలగకుండా శాంతి భద్రతలు కాపాడాలని పోలీసులకు తెలంగాణ డీజీపీ స్పష్టం చేశారు. ఏఐ టెక్నాలజీతో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని పోలీసులకు వివరించారు. యువత డ్రగ్స్‌కి అలవాటు కాకుండా ఉండేందుకు కఠినమైన చర్యలు చేపట్టాలని ఉన్నతాధికారులను ఆదేశించారు. రాష్ట్రంలో మావోయిస్టులను పూర్తిగా అదుపు చేశామని గుర్తు చేశారు. ప్రస్తుతం కొత్తగా మాదక ద్రవ్యాలు, సైబర్ క్రైమ్స్, రోడ్డు ప్రమాదాలపై దృష్టి సారించాలని పోలీసులకు స్పష్టం చేశారు.

## కన్నెపల్లి వద్ద లక్ష క్యూసెక్కుల నీళ్లు సముద్రంలో కలుస్తున్నాయి: కెటిఆర్

హైదరాబాద్:

మాజీ సిఎం కెసిఆర్ ప్రభుత్వం వచ్చాక సాగునీరు విస్తీర్ణం పెరిగిందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తెలిపారు. హమాలీల సమస్యలను తీర్చే బాధ్యత బిఆర్ఎస్ దేనని కెసిఆర్ అన్నారని అన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. రూ.8 ఉన్న రూ. 26 చేసుకున్నాం..260 శాతం పెంచుకున్నామని, దేశ ప్రజలకు బువ్వ పెట్టింది రైతులైతే ధాన్యం బస్తాలు మోసింది హమాలీలు అని తెలియజేశారు. ఢిల్లీకి బస్తాలు మోసి సిఎం రేవంత్ రెడ్డి అవస్థలు పడుతున్నారని, దేశమంతా వర్షాలు లేవు..తెలంగాణలో 23 జిల్లాలో లేవు అని విమర్శించారు. కన్నెపల్లి వద్ద లక్ష క్యూసెక్కుల నీళ్లు సముద్రంలో కలుస్తున్నాయని, వర్షాలు లేకున్నా, కరువు ఉన్నా, మండు వేసవిలో నీళ్లు ఉండేలా ఉన్న ప్రాంతంలో కాళేశ్వరం కట్టినామని కెటిఆర్ పేర్కొన్నారు.



# మన్యంవీరుడు అల్లూరికి ఘన నివాళి

## ఎక్స్ వేదికగా నివాళి అర్పించిన బాబు, లోకేశ్

## అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి అనిత నివాళి

**అమరావతి,**

స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేశ్ నివాళులర్పించారు. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. అల్లూరి త్యాగం, ధైర్యం, దేశభక్తి భారత జాతికి చిరస్మరణీయమని ముఖ్యమంత్రి కొనియాడారు. మన్యం వీరుడి పోరాట పటిమ, విప్లవ కార్యాచరణ అనితర సాధ్యమని మంత్రి లోకేశ్ అన్నారు. 'స్వాతంత్ర్య సమర చరిత్రలో అజరామరమైన అధ్యాయంగా నిలిచారు మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు. గిరిజనుల హక్కులు, ఆత్మగౌరవ పరిరక్షణ కోసం బ్రిటిష్ పాలనకు ఎదురొడ్డి అపూర్వ సాహసాన్ని ప్రదర్శించిన మహనీయుడు. ఆయన త్యాగం, ధైర్యం, దేశభక్తి యావత్ భారత జాతికి చిరస్మరణీయం. అల్లూరి సీతారామరాజు 129వ జయంతి సందర్భంగా ఆ మహావీరుడికి ఘన నివాళులు అర్పిస్తున్నాను' అని చంద్రబాబు పోస్ట్ చేశారు. 'మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఆ మహనీయుని స్మృతికి ఘన నివాళులు అర్పిస్తున్నాను. భారత స్వాతంత్ర్య ఉద్యమాన్ని విప్లవపథం వైపు నడిపిన పోరాటయోధుడు అల్లూరి సీతారామరాజు. దేశభక్తికి, త్యాగనిరతికి నిలువెత్తు నిదర్శనంగా నిలిచారు. ఆయన పోరాట పటిమ, విప్లవ కార్యాచరణ అనితర సాధ్యం. తెలుగుజాతికి, దేశానికి స్ఫూర్తిప్రదాతగా నిలిచిన అల్లూరి సీతారామరాజు సేవలను ఈ సందర్భంగా స్మరించుకుందాం' అని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా నక్కపల్లి ఎంపీడీవో కార్యాలయం వద్ద అల్లూరి విగ్రహానికి హోంమంత్రి అనిత పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మండల ప్రజాపరిషత్ కార్యాలయ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా హోంమంత్రి మాట్లాడుతూ.. దేశ స్వాతంత్యం÷-ర కోసం పోరాడిన యోధుడు, మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు అని అన్నారు. ప్రజల హక్కుల కోసం పోరాడి 27 ఏళ్ల చిన్న వయసులోనే ప్రాణ త్యాగం చేసిన విప్లవ జ్యోతి మన్యం వీరుడు అని కొనియాడారు. అల్లూరి దేశభక్తి, ధైర్యం యువతరానికి ఆదర్శమని హోంమంత్రి అన్నారు. సీఎం చంద్రబాబు ఆదేశాలతో అల్లూరి జయంత్యుత్సవాలను రాష్ట్ర పండుగగా నిర్వహించుకుంటున్నామని తెలిపారు. తెలుగు జాతి ఉన్నంతవరకూ ఆయన త్యాగం ప్రజల గుండెల్లో ఉంటుందన్నారు. అల్లూరి సీతారామరాజు ధైర్య సాహసాలకు ప్రతీక అని హోంమంత్రి అనిత కొనియాడారు.

# పాపికొండల యాత్ర మళ్లీ ప్రారంభం

## రాజమండ్రి, భద్రాచలం నుంచి యధావిధిగా యాత్ర

**రాజమండ్రి,**

భద్రతా కారణాల దృష్ట్యా గత జూన్ చివరి వారంలో తాత్కాలికంగా నిలిచిపోయిన ప్రపంచ ప్రసిద్ధ పాపికొండలు బోటింగ్ విహారయాత్రకు ఎట్టకేలకు అధికారులు మళ్లీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. గోదావరి నది ఉధృతి తగ్గుముఖం పట్టడం, పర్యాటక బోట్ల ఫిట్‌నెస్ మరియు భద్రతా ప్రమాణాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ యాత్రను అటు రాజమండ్రి పుష్కర ఘాట్ నుండి, ఇటు భద్రాచలం నుండి పర్యాటకుల సౌకర్యార్థం అందుబాటులోకి తెచ్చారు. ప్రకృతి ప్రేమికులకు, కుటుంబ సమేతంగా ఆహ్లాదకరమైన సమయాన్ని గడపాలనుకునే వారికి ఇది ఒక గొప్ప అవకాశం. గోదావరి జలవిహారంలో పర్యాటకులకు ఆధ్యాత్మికతతో పాటు ప్రకృతి అందాలను వీక్షించే అద్భుతమైన అవకాశం లభిస్తుంది. ఈ టూర్ ప్యాకేజీలో భాగంగా గండిపోచమ్మ ఆలయం, సుందరమైన పాపికొండలు, మరియు ప్రశాంతమైన పేరంటాలపల్లి ఆశ్రమం వరకు బోటింగ్ ప్రయాణం సాగుతుంది. ప్రయాణీకుల భద్రతకు పెద్దపీట వేస్తూ లైఫ్ జాకెట్లు మరియు అనుభవజ్ఞులైన సిబ్బందిని బోట్లలో అందుబాటులో ఉంచారు. ఇక టికెట్ ధరల విషయానికి వస్తే? పెద్దలకు రూ. 1250, మరియు 5 నుండి 10 సంవత్సరాల లోపు పిల్లలకు రూ. 1050 గా నిర్ణయించారు. చాలా కాలం తర్వాత బోటింగ్ పునఃప్రారంభం కావడంతో పర్యాటక రంగం మళ్లీ కళకళలాడనుంది.

# ఇరాన్ సుప్రీం ఖమేనీ అంత్యక్రియలు

## భారత బృందంలో బీహార్ గవర్నర్, కేంద్రమంత్రి

**టెహ్రాన్,**

అమెరికా దాడుల్లో మృతిచెందిన ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలు శనివారం అధికారికంగా ప్రారంభమయ్యాయి. అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త దాడుల్లో ఈ ఏడాది ఫిబ్రవరి 28న మరణించిన 86 ఏళ్ల ఖమేనీకి చివరి వీడ్కోలు పలికేందుకు వేలాదిగా ప్రజలు టెహ్రాన్ నగరానికి తరలివచ్చారు. దేశ జెండాతో కప్పిన ఖమేనీ పార్థివదేహాన్ని నల్ల తలపాగా ఉంచిన శవపేటికలో పెట్టి అంతిమ సందర్శనకు ఉంచారు. అమెరికా దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన ఖమేనీ కుటుంబ సభ్యుల పార్థివదేహాలనూ ఆయన పక్కనే ఉంచారు. అందులో ఖమేనీ 14 నెలల మనవరాలి చిన్న శవపేటిక అందరి మనసులను కలచివేస్తోంది. ఆ చిన్నారి శవపేటిక పక్కనే ఆమె ఫొటోను కూడా ఉంచారు. వారం రోజుల అంతిమ సంస్కారాల్లో భాగంగా శుక్రవారం సాయంత్రమే ఖమేనీ పార్థివదేహం టెహ్రాన్‌కు చేరుకుంది. దీంతో గ్రాండ్ మొసల్లా ప్రాంగణం వెలుపల భారీ సంఖ్యలో అభిమానులు, మద్దతుదారులు బారులు తీరారు. శనివారం ఉదయం గ్రాండ్ మొసల్లా ద్వారాలు తెరవగానే వేలాది మంది లోపలికి ప్రవేశించి ఖమేనీకి కన్నీటి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఎర్ర జెండాలు చేతబట్టి వచ్చిన మద్దతుదారులు అమెరికాకు వ్యతిరేకంగా నినాదాలు చేసారు. వారి నినాదాలతో గ్రాండ్ మొసల్లా ప్రాంగణం మార్మోగిపోతోంది. 'నా ప్రియమైన నాయకుడికి వీడ్కోలు చెప్పేందుకు వచ్చాను. ఇలాంటి రోజు వస్తుందని ఎన్నడూ ఊహించ లేదు. ఈ విషాదాన్ని చూడకముందే నేను చనిపోయి ఉంటే బాగుండేది' అంటూ ఓ యువకుడు భావోద్వేగానికి గురయ్యాడు. కాగా, రాబోయే మూడు రోజుల్లో ఒక్క టెహ్రాన్‌లోనే 1.5 నుంచి 2 కోట్ల మంది వరకు ఖమేనీ అంత్యక్రియల్లో పాల్గొనే అవకాశం ఉందని ఇరాన్ అధికారులు అంచనా వేస్తున్నారు. మరోవైపు ఇరాన్ పార్లమెంట్ స్పీకర్, అమెరికాతో చర్చలకు ప్రధాన ప్రతినిధిగా వ్యవహరించిన మహమ్మద్ బాఘర్ ఘాలిబాఫ్ సహా పలువురు ప్రముఖులు ఖమేనీకి నివాళులర్పించారు. తాజా దాడుల్లో మరణించిన రివల్యూషనరీ గార్డ్స్ మాజీ చీఫ్ స్థానంలో నియమితులైన అహ్మద్ వాహిదీ కూడా అంతిమ సంస్కారాల్లో పాల్గొన్నారు. భారత్ తరఫున బిహార్ గవర్నర్ సయ్యద్ అటా హుస్సైనీన్, విదేశాంగ శాఖ సహాయ మంత్రి పబిత్ర మార్గరిటా ఈ కార్యక్రమాలకు హాజరయ్యారు. కాగా, సోమవారం వరకు ఖమేనీ పార్థివదేహాన్ని టెహ్రాన్‌లో ప్రజల సందర్శనార్థం ఉంచనున్నారు. అనంతరం నగరంలో భారీ అంతిమయాత్ర నిర్వహిస్తారు. మంగళవారం నాడు పవిత్ర నగరమైన ఖోమ్‌కు, బుధవారం ఇరాక్‌లోని పవిత్ర ప్రాంతాలకు తీసుకెళ్తారు. గురువారం నాడు ఈశాన్య ఇరాన్‌లోని ఖమేనీ స్వస్థలమైన మష్హద్‌లో ప్రభుత్వ లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.

# బ్రిటిష్ వారిని ఎదరించిన మన్యం వీరుడు

## అల్లూరి జయంతి సందర్భంగా పవన్ నివాళి

**అమరావతి,**

మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఘన నివాళులు అర్పించారు. వీర యోధుడు అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా, ఆ స్వాతంత్య సమరయోధుడికి ప్రగాఢ నివాళులు అర్పిస్తున్నానని తెలిపారు. స్వాతంత్ర్యం కోసం బ్రిటిష్ పాలనను ధైర్యంగా ఎదిరించి, గిరిజన ప్రజల హక్కులు, గౌరవం కోసం తన జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. ఈ మేరకు ఎక్స్ వేదికగా పవన్ కల్యాణ్ పోస్టు పెట్టారు. ÷ారత స్వాతంత్య పోరాట చరిత్రలో అల్లూరి సీతారామరాజు చిరస్థాయిగా నిలిచిపోయారని పవన్ కల్యాణ్ ప్రశంసించారు. ఆయన పోరాటం కేవలం ఒక ఉద్యమం మాత్రమే కాదని చెప్పారు. ధైర్యం, త్యాగం, దేశభక్తిని ఎన్నటికీ మరిచిపోలేమని అన్నారు. అల్లూరి ఆశయాలే దేశానికి మార్గదర్శకమని వ్యాఖ్యానించారు. స్వాతంత్యాన్ని కాపాడాలంటే బాధ్యతతో జీవించాలని... దేశాన్ని బలోపేతం చేయాలంటే సేవాభావంతో ముందుకు సాగాలని... సమాజం కోసం నిలబడటమే నిజమైన దేశభక్తి అని అల్లూరి సీతారామరాజు జీవితం మనకు నేర్పుతుందని చెప్పుకొచ్చారు. అందరం ఆ మహనీయుని ఆదర్శాల నుంచి స్ఫూర్తి పొంది, న్యాయం, సేవ, దేశభక్తి వంటి విలువలను ఆచరిస్తూ, అభివృద్ధి చెందిన భారతదేశ నిర్మాణంలో భాగస్వాములం కావాలని పవన్ కల్యాణ్ ఆకాంక్షించారు.

# వరుస భూకంపాలను డబ్లెట్ అంటారు

## ఒకేరోజు పలు దేశాల్లో ప్రకంపనలు

## కాలిఫోర్నియా, జపాన్, పుల్వామాలోనూ ప్రకంపనలు

**న్యూఢిల్లీ,**



వెనెజువెలా దేశం శతాబ్దకాలంలో ఎన్నడూ చూడని ప్రకృతి విపత్తును చవిచూసింది. వెనువెంటనే రెండు శక్తిమంతమైన భూకంపాలతో ఉక్కిరిబిక్కిరైంది. తొలి భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 7.1గా నమోదు కాగా, రెండోది మరింత తీవ్రత (7.5)తో వచ్చింది. అదే సమయంలో కొంచెం అటూఇటుగా అమెరికాలోని కాలిఫోర్నియాలో (5.6), జపాన్ (7.2)లోనూ భూకంపాలు వచ్చాయి. ప్రపంచంలో ఒకే రోజు ఇలా వేర్వేరు చోట్ల పుడమి ఉగ్రరూపం దాల్చడంపై సర్వత్రా ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ భూకంపాల మధ్య ఏమైనా సంబంధం ఉందా..? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. అయితే, దీనికి 'కాదు' అనే సమాధానం ఇస్తున్నారు కాలిఫోర్నియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీకి చెందిన భూకంప శాస్త్రవేత్త డాక్టర్ లూసీ జోన్స్. ఈ భూకంపాలు వేర్వేరు ఫాల్ట్ సిస్టమ్స్ (ఫలకాలు కలిసే సరిహద్దులు, పగుళ్లు), ప్లేట్ బౌండరీల్లో సంభవించాయి. అంటే వాటి మధ్య సంబంధం లేదని అర్థం. ఒకదానిని మరొకటి ప్రేరేపించలేదు. ఒక చోట సంభవించే భారీ భూకంపాలు.. వేల మైళ్ల దూరంలో మరో భూకంపానికి దారితీసే అవకాశం చాలా తక్కువగా ఉంటుందని జోన్స్ వెల్లడించారు. ఇలా ఒకే సమయంలో వేర్వేరు చోట్ల భూమి కంపించడం అనేది యాదృచ్ఛికమేనని చెబుతున్నారు. ఒక ప్రాంతంలో భూకంపం రావడమనేది అనూహ్యంగా జరిగే సంఘటన కాదు. కొన్ని దశాబ్దాలు, శతాబ్దాలుగా భూగర్భంలో ఒత్తిడి పేరుకుపోయి.. ఫలకాలు ఒకదానికొకటి రాసుకోవడం వల్ల ఇవి సంభవిస్తుంటాయి. అయితే భూకంపాలు సరిగ్గా ఎప్పుడు వస్తాయనేది అంచనా వేయడం అసాధ్యమే అయినా.. ఇలా ఒక్కసారిగా భూమి కంపించడం ఒక చక్రంలా జరిగే పక్రియేనని జోన్స్ పేర్కొన్నారు. కాగా.. జమ్మూకశ్మీర్‌లోని పుల్వామాలో 3.5 తీవ్రతతో భూప్రకంపనలు చోటుచేసుకున్నాయి. బుధవారం సాయంత్రం నుంచి ప్రపంచవ్యాప్తంగా పలు దేశాల్లో భూకంపాలు రాగా.. గురువారం తెల్లవారుజామున పుల్వామాలో భూమి కంపించిందని నేషనల్ సెంటర్ ఫర్ సిస్మాలజీ వెల్లడించింది. భూకంప కేంద్రం నేపాల్‌లో 15 కిలోమీటర్ల లోతున ఉన్నట్లు పేర్కొన్నారు. ఇక, జపాన్‌లో తొలుత భూకంప తీవ్రత 6.9 అని రాగా.. తర్వాత దానిని 7.2గా సవరించారు. చాలా తక్కువ వ్యవధిలో అంటే కొన్ని సెకన్ల నుంచి నిమిషాల తేడాతో దాదాపు ఒకే తీవ్రత గల రెండు భూకంపాలు ఒకే ప్రాంతంలో సంభవించడాన్ని 'ఎర్త్‌క్వేక్ డబ్లెట్' అంటారు. ఒకసారి భూకంపం వచ్చిన తర్వాత తక్కువ తీవ్రతతో చిన్న చిన్న ప్రకంపనలు రావడం సహజమే. కానీ డబ్లెట్ విషయానికొస్తే.. రెండోసారి వచ్చే భూకంపం కూడా దాదాపు మొదటిదానంత తీవ్రంగా ఉంటుంది. ఇప్పుడు వెనెజువెలాలో 39 సెకన్ల వ్యవధిలో వరుస భూకంపాలు వచ్చాయి. దీంతో ఇప్పుడు ఈ దేశ పరిస్థితిని శాస్త్రవేత్తలు 'ఎర్త్‌క్వేక్ డ్లబెట్'గా పిలుస్తున్నారు. వెనెజువెలాలో ఈస్థాయిలో భూకంపం 1900 సంవత్సరంలో వచ్చింది. అప్పుడు దాని తీవ్రత 7.7గా నమోదైంది. దాంతో రాజధాని సమీప ప్రాంతాలు ప్రభావితమయ్యాయి. మళ్లీ 2018లో 7.3 తీవ్రతతో భూమి కంపించినప్పటికీ.. ఆస్తి, ప్రాణనష్టం ఇప్పటితో పోలిస్తే తక్కువగానే సంభవించింది.

# ధైర్యసాహసాలకు నిలువుటద్దం అల్లూరి

## నివాళి అర్పించిన టిడిపి అధ్యక్షుడు పల్లా

## వవేకానంద, కొణిజేటిలకు కూడా నివాళి

**విశాఖపట్నం,**

మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు త్యాగం, ధైర్యసాహసాలు, దేశభక్తి భావం భావితరాలకు స్ఫూర్తిదాయకమని తెలుగుదేశం పార్టీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు కొనియాడారు. ఆదివాసీల హక్కుల కోసం పోరాడి బ్రిటిష్ పాలనకు సవాల్ విసిరిన మహావీరుడిగా అల్లూరి చరిత్రలో చిరస్థాయిగా నిలిచారని వ్యాఖ్యానించారు. అల్లూరి సీతారామరాజు జయంతి సందర్భంగా శనివారం గాజువాకలోని ఆయన విగ్రహానికి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. అల్లూరి ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకుని దేశ, సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పల్లా శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. అలాగే, గాజువాకలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో స్వామి వివేకానంద వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి టీడీపీ ఏపీ అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు ఘన నివాళులు అర్పించారు. యువతలో ఆత్మవిశ్వాసం, దేశభక్తి, సేవాభావాన్ని పెంపొందించిన మహనీయుడు స్వామి వివేకానంద అని కొనియాడారు. వివేకానంద చూపిన మార్గం నేటి సమాజానికి స్ఫూర్తిదాయకమని ప్రశంసించారు. యువత వివేకానంద ఆశయాలను ఆదర్శంగా తీసుకుని దేశాభివృద్ధికి తమ వంతుగా కృషి చేయాలని పిలుపు నిచ్చారు. మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య జయంతి సందర్భంగా పల్లా శ్రీనివాసరావు ఘన నివాళులు అర్పించారు. నిజాయితీ, నిరాడంబరత, ఆర్థిక క్రమశిక్షణతో కూడిన రాజకీయాలకు రోశయ్య ఆదర్శప్రాయమని కొనియాడారు. ప్రజా సమస్యలపై అపారమైన అవగాహన, శాసనసభలో ఆయన చూపిన ప్రతిభ చిరస్మరణీయమని వ్యాఖ్యానించారు. ప్రజాసేవ పట్ల అంకితభావంతో పనిచేసిన నాయకుడిగా రోశయ్య సేవలు చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు. నేటి తరానికి రోశయ్య జీవితం, విలువలు స్ఫూర్తిదాయకమని అభిప్రాయపడ్డారు.

# సిఎం హోదాలో విజయ్ తొలి పుట్టినరోజు

## శుభాకాంక్షలు తెలిపిన రాజకీయ, సినీ ప్రముఖులు

## ఎక్స్ వేదికగా ప్రధాని మోడీ, రాహుల్, స్టాలిన్ , పవన్ శుభాకాంక్షలు

చెన్నై, తమిళనాడు రాజకీయాల్లో ప్రభంజనం సృష్టిస్తూ ఎన్నికల్లో పోటీచేసిన తొలిసారే విజయాన్ని సాధించిన విజయ్ ముఖ్యమంత్రి హోదాలో సోమవారం పుట్టినరోజు చేసుకున్నారు. దీంతో సినీ, రాజకీయ ప్రముఖులు సోషల్ మీడియా వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం రాత్రి శివకాశిలో గంటసేపు బాణాసంచా కాల్చి అభిమానులు సందడి చేశారు. తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్‌కు జన్మదిన శుభాకాంక్షలు. మీరు దీర్ఘాయుష్షుతో జీవించాలని ప్రార్థిస్తున్నాను అంటూ ప్రధాని మోదీ సందేశం తెలిపారు. విజయ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు. అన్ని ప్రయత్నాలలో మీరు విజయం సాధించాలని ఆకాంక్షిస్తున్నాను. తమిళ ప్రజల హక్కులు, గౌరవం, ఆకాంక్షలను పరిరక్షించడంలో, రాష్ట్ర ప్రగతి కోసం కలిసి పనిచేయడంలో నేను మీకు అండగా నిలుస్తానని కాంగ్రెస్ ఎంపీ రాహుల్ గాంధీ అభినందనలు తెలిపారు. విజయ్‌కు జన్మదిన శుభాకాంక్షలు. మీరు ఆరోగ్యంగా, సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నా. మీరు చేపట్టే అన్నీ ప్రయత్నాల్లో విజయం సాధించాలని.. ప్రజలకు ఇలానే సేవ చేయాలని ఆకాంక్షిస్తున్నానని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు తెలియచేశారు. విజయ్ మీరెప్పుడూ ఆరోగ్యంతో ఉండాలని.. ప్రజలకు సేవను కొనసాగించడానికి అవసరమైన శక్తిని పొందాలని కోరుకుంటూ.. పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు తమిళనాడు మాజీ సీఎం స్టాలిన్. కోట్ల మంది ప్రేమను సొంతం చేసుకున్న తమ్ముడు విజయ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు అని నటుడు కమల్ హాసన్ తెలిపారు. హ్యాపీ బర్త్‌డే విజయ్ సర్. ఈ సంవత్సరమంతా మీకు అద్భుతంగా ఉండాలని కోరుకుంటున్నానని నటి నయనతార శుభాకాంక్షలు తెలిపారు. నా సోదరుడు, తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్‌కు పుట్టినరోజు శుభాకాంక్షలు అంటూ నటి ఖుష్బూ తెలిపారు.

# గాలివానకు కూలిన ఇళ్లకు పరిహారం చెల్లించాలి

## కలెక్టర్‌కు విన్నివించిన సౌరసంక్షేమ సమితి

**సిరిసిల్ల,**

సిరిసిల్ల పట్టణంలో ఇటీవల గాలివానలు, భారీ వర్షాల కారణంగా ఇండ్లు కూలిపోయిన బాధితులకు ప్రభుత్వం ప్రకటించిన నష్టపరిహారాన్ని వెంటనే అందించాలని సిరిసిల్ల పౌర సంక్షేమ సమితి డిమాండ్ చేసింది. ఈ మేరకు సంఘం ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించింది. ఈ సందర్భంగా సమితి ప్రతినిధులు మాట్లాడుతూ వర్షాలకు ఇండ్లు కోల్పోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్న అనేక మంది బాధితులకు ఇప్పటికీ ఆర్థిక సాయం అందలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నిర్ణయించిన నష్టపరిహారం పూర్తిస్థాయిలో కాకపోయినా, కనీసం తక్షణ సహాయంగా ఇవ్వాల్సిన మొత్తాలు కూడా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. సిరిసిల్ల తహసీల్దార్ కార్యాలయంలో ఇండ్లు కూలిన బాధితుల దరఖాస్తులు పెద్ద సంఖ్యలో పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే పరిశీలించి అర్హులైన వారికి నష్టపరిహారం విడుదల చేయాలని కోరారు. అలాగే సిరిసిల్ల తహసీల్దార్ కార్యాలయ సూపరింటెండెంట్ భాస్కర్ రెడ్డిని బదిలీ చేయాలని కూడా కలెక్టర్‌ను కోరినట్లు వారు తెలిపారు. ఆయన చాలా కాలంగా సిరిసిల్లలోని వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్నారని, ప్రస్తుతం బదిలీల సమయం కావడంతో ఇతర ప్రాంతానికి బదిలీ చేయాలని విజ్ఞప్తి చేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిరిసిల్ల పౌర సంక్షేమ సమితి అధ్యక్షుడు బియ్యంకార్ శ్రీనివాస్, సహాయ కార్యదర్శి కుసుమ గణెళిష్ తదితరులు పాల్గొన్నారు.

# టూవీలర్ చోరీ ముఠా అరెస్ట్

## ముగ్గురు దొంగలను పట్టుకున్న పోలీసులు

**నల్లగొండ,**

మిర్యాలగూడ పట్టణంలో పలు చోట్ల ద్విచక్ర వాహనాలు చోరికి పాల్పడిన ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ సోమనర్సయ్య తెలిపారు. మంగళవారం టూ టౌన్ పోలీస్ట్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. పట్టణ పోలీసులు హనుమాన్‌పేట ఫ్లై ఓవర్ వద్ద వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా అనుమానాస్పదంగా వెళు ‸న్న ద్విచక్ర వాహనాన్ని ఆపి డాక్యుమెంట్లు చూపించాలని అడగగా వారు ఎలాంటి పత్రాలు చూపించకపోవడంతో పోలీసులు అదుపులోకి తీసుకుని విచారించారు. నిందితులు మద్యం సేవించడం, గుట్కా వినియోగించడం, పేకాట ఆడడం వంటి చెడు వ్యసనాలకు అలవాటుపడి డబ్బులు సంపాదించాలన్న ఉద్దేశ్యంతో పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో పార్క్ చేసి ఉన్న మోటార్ సైకిళ్లను చోరి చేసినట్లు ఒప్పుకున్నారు. నిందితులను నల్లగొండ పట్టణ అర్జాలబావికి చెందిన కొంగరి నవీన్‌కుమార్, పాలకీడు మండలం గుడుగుంట్లపాలెంకు చెందిన సోమిరెడ్డి సైదిరెడ్డి, దామరచర్ల మండలం వాడపల్లికి చెందిన కె.సుమలతగా గుర్తించారు. పాత ద్విచక్ర వాహనాలను దొంగలించి దామరచర్ల మండల కేంద్రంలో ఉన్న సుమలత పాత ఇనుప సామాను దుకాణంలో విక్రయించినట్లు తెలిపారు. ఆమె మోటార్ సైకిళ్లను రూ.2,500 నుండి రూ.3 వేలకు తక్కువ ధరకు కొనుగోలు చేసి విడి భాగాలుగా విభజించి విక్రయించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. చోరీ వాహనాల స్పేర్ పార్ట్స్ విక్రయించగా వచ్చిన రూ.1.38 లక్షల నగదును సుమలత నుండి స్వాదీనం చేసుకున్నట్లు తెలిపారు. అదేవిధంగా నిందితుల నుండి రెండు మోటార్ సైకిళ్లు, రూ.1.38 లక్షల నగదును స్వాదీనం చేసుకున్నట్లు వివరించారు. ముగ్గురు నిందితులను కోర్టులో రిమాండ్ చేసినట్లు తెలిపారు. సమావేశంలో పట్టణ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# బీబీపేట గ్రామ శివారులో చిరుత సంచారం

**సంగారెడ్డి,**

సంగారెడ్డి జిల్లాలోని కల్హేర్ మండలం బీబీపేట గ్రామ శివార్లలో చిరుత పులి సంచారం స్థానిక ప్రజలను భయాందోళనలకు గురిచేస్తోంది. గత కొంతకాలంగా ఈ ప్రాంతంలో చిరుత కదలికలు ఉన్నట్లు వార్తలు వస్తున్న నేపథ్యంలో.. తాజాగా ఓ రైతు పొలంలో లేగ దూడపై దాడి చేయడంతో గ్రామస్థులు ఉలిక్కిపడ్డారు.

PRGI NO: TGTEL/25/A5314
అర్జున్ సమాచారం
www.arjunsamaachaaram.in
తెలుగు దినపత్రిక
ఎడిటర్ : లింగం రాజయ్య
బ్యూరో చీఫ్ : గిరవెన రాకేష్

# సంపాదకీయం...

## ఆయారామ్ గయారామ్‌లకు అడ్డేదీ?

పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర రాష్ట్రాల్లో ఇటీవల కొంతమంది ఎంఎల్ఏలు, ఎంపిల పార్టీ ఫిరాయింపులు ఎంతటి రాజకీయ సంక్షోభాన్ని సృష్టించాయో తెలిసిందే. అసెంబ్లీ ఎన్నికల్లో తృణమూల్ కాంగ్రెస్ ఘోర పరాజయం పొందిన తరువాత సుమారు 60మంది టిఎంసి ఎంఎల్ఏలు, 20 మంది ఎంపిలు తిరుగుబాటు బావుటా ఎగరేశారు. బహిష్కృత నేత రీతబ్రత బెనర్జీని తమ నాయకుడుగా 60మంది టిఎంసి ఎంఎల్ఏలు ఎన్నుకున్నారు. లోక్‌సభలో టిఎంసి ఎంపిలు కకోలీఘోష్ దస్తీదార్ నేతృత్వంలో పార్టీనుంచి విడిపోయి నేషనలిస్ట్ సిటిజన్స్ పార్టీ ఆఫ్ ఇండియాలో విలీనమయ్యారు. ఈ తిరుగుబాటుదారులకు బిజెపి మద్దతు ప్రకటించడం గమనార్హం. అలాగే మహారాష్ట్రలో ఉద్ధవ్ థాక్రే నేతృత్వంలోని శివసేన (యుబిటి) నుండి ఏక్‌నాథ్ షిండే వర్గంలోకి ఎంపిలు, ఎంఎల్ఏలు భారీగా ఫిరాయింపులకు పాల్పడ్డారు. థాక్రే శిబిరానికి ఇది పెద్ద ఎదురు దెబ్బ కాగా, దీనిని షిండే వర్గం 'ఆపరేషన్ టైగర్'గా అభివర్ణించింది. ఈ పరిణామాలు చూస్తుంటే ప్రజాస్వామ్య విలువలకు నేతలు ఎంతవరకు కట్టుబడి ఉన్నారో, ప్రజాస్వామ్య వ్యవస్థను ఎంత బలహీన పరుస్తున్నారో ప్రత్యక్షమవుతోంది. 'తెప్పలుగ చెరువు నిండిన కప్పలు పదివేలు చేరు' అన్న సుమతీ శతక నానుడి జ్ఞాపకం వస్తోంది. ఈ ఫిరాయింపుల జాడ్యం ఏ ఒక్క రాష్ట్రానికి పరిమితం కాలేదు. దేశం మొత్తం మీద ఇదే ధోరణి కొనసాగుతోంది. ఈ ఫిరాయింపుల వల్ల అంతవరకు అధికారంలో ఉన్న ప్రభుత్వాలు కూడా కుప్పకూలిపోయే పరిస్థితి ఏర్పడుతోంది. 1952 నుంచి 1967 వరకు మొత్తం 542 ఫిరాయింపులు జరగ్గా, 1967 మార్చి నుంచి 1968 ఫిబ్రవరి మధ్య కాలంలోనే దాదాపు 438 మంది శాసనసభ్యులు పార్టీలను ఫిరాయించడం గమనార్హం. 1967లో గయాలాల్ అనే శాసనసభ్యుడు ఒక్క రోజులోనే మూడుసార్లు పార్టీలను ఫిరాయించి ఆయారామ్ గయారామ్ అనే అపఖ్యాతికి అంకురార్పణ చేశాడు. ఇంతవాడు అంతంతై దీంతో ఈ ఫిరాయింపులను నివారించడానికి తగిన చట్టం రూపకల్పనకు వైబి చవాన్ అధ్యక్షతన కమిటీ కొన్ని సిఫార్సులను చేసింది. ఒక పార్టీ నుంచి మరో పార్టీకి మారే ప్రజాప్రతినిధిని అంటే ఫిరాయింపుదారుడిని మంత్రి పదవి, స్పీకర్ పదవి లేదా ప్రభుత్వం ద్వారా ధనలబ్ధి పొందే ఎలాంటి పదవుల్లోనైనా ఏడాది పాటు, మళ్లీ ఎన్నికయ్యేవరకు నియమించకూడదని కమిటీ సిఫార్సు చేసింది. ఫిరాయింపులు ప్రజాస్వామ్యానికి విరుద్ధమని, అలాంటివారికి ఎలాంటి పదవులు దక్కకుండా కఠిన చర్యలు తీసుకోవాలని సూచించింది. దీంతో 1985లో రాజ్యాంగం లోని 52 సవరణ ద్వారా పార్లమెంట్ చివరకు పార్టీ ఫిరాయింపుల వ్యతిరేక చట్టాన్ని రాజ్యాంగంలోని 10వ షెడ్యూల్‌లో చేర్చింది. అయితే ఆ తర్వాత వ్యక్తులు పార్టీలు మారడం అనేది పెద్ద ఎత్తున ముందస్తు ప్రణాళికతో చేసిన కుట్రల ద్వారా పార్టీలు ముక్కలు కావడానికి దారితీసింది. ఒక పార్టీకి చెందిన శాసనసభ్యుల్లో 1/3 వంతు మంది విడిపోవడాన్ని చట్టబద్ధం చేయడంవల్ల ఆ నిబంధన పార్టీ మారడానికి, ప్రభుత్వాన్ని కూల్చడానికి, తామే అధికారంలోకి రావడానికి ఒక లైసెన్స్‌లా ఉపయోగపడింది. గతంలో రాజ్యాంగం లోని 10వ షెడ్యూల్, పారాగ్రాఫ్ 3 ప్రకారం ఒక పార్టీ ఎంఎల్ఏల్లో 1/3 వంతు మంది ఒకేసారి వేరుపడితే వారిని చట్టవ్యతిరేక ఫిరాయింపుదారులుగా పరిగణించేవారు కాదు. ఈ మినహాయింపును అడ్డంపెట్టుకుని స్వార్థప్రయోజనాల కోసం పార్టీలను మార్చేవారు. చివరికి ప్రభుత్వాన్ని కూడా కూలగొట్టేవారు. దీన్ని నివారించడానికి, ఈ చట్టాన్ని మరింత ప్రభావంతం చేయడానికి 2003లో 91వ రాజ్యాంగ సవరణద్వారా ఈ పారాగ్రాఫ్ 3 ని రద్దు చేసి పరిమితిని 1/3 నుంచి 2/3 (మూడింట రెండు వంతులు)కు పెంచారు. అయినా ఫిరాయింపుల పీడ విరగడ కాలేదు. కాంగ్రెస్ ఎంపి మనీష్ తివారీ 2010, 2021, 2025 లో లోక్‌సభలో ప్రైవేట్ మెంబర్ బిల్లులు ప్రవేశపెట్టారు.

## ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించిన అడువాల జ్యోతి లక్ష్మణ్




**అర్జున్ సమాచారం జులై 6 జగిత్యాల ప్రతినిధి ::**

జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ జన్మదినం సందర్భంగా మాజీ మున్సిపల్ చైర్పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ ఆధ్వర్యంలో జగిత్యాల పట్టణంలోని భక్త మార్కండేయ దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో వర్ధిల్లాలని, ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని మార్కండేయ స్వామివారిని ప్రార్థించారు. అనంతరం భక్తులకు, ప్రజలకు అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అడువాల జ్యోతి లక్ష్మణ్ గారు మాట్లాడుతూ, ప్రజల సంక్షేమమే ధ్యేయంగా, జగిత్యాల అభివృద్ధే లక్ష్యంగా నిరంతరం కృషి చేస్తున్న ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ మరింత ఉన్నత స్థానాలను అధిరోహించి, ప్రజలకు మరింత సేవ చేసే అవకాశం పొందాలని ఆకాంక్షించారు. అలాగే, శ్రీ మార్కండేయ స్వామివారి దివ్య ఆశీస్సులు ఎమ్మెల్యే గారిపై ఎల్లప్పుడూ ఉండాలని, ప్రజల ప్రేమాభిమానాలతో మరెన్నో జన్మదిన వేడుకలను జరుపుకోవాలని కోరుతూ హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఇట్టి కార్యక్రమంలో పాల్గొన్న మాజీ మున్సిపల్ చైర్మన్ గిరి నాగభూషణం, కౌన్సిలర్ దయ్యాల చంద్రకళ శంకర్, కో ఆప్షన్ వీరభద్ర పద్మజ శ్రీనివాస్, కౌన్సిలర్ గంగాధర్,నవీన్, పవిత్ర మహేష్, సాయికిరణ్, మున్సిపల్ స్టాండింగ్ కమిటీ సభ్యులు సిరిపురం మహేందర్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ ప్రేమలత సత్యం, పద్మశాలి సేవ సంఘ అధ్యక్షులు బోగ గంగాధర్ మరియు కార్యవర్గ సభ్యులు, పద్మశాలి సేవా సంఘ మాజీ అధ్యక్షులు గంగాధర్, శ్రీనివాస్, మరియు పద్మశాలి కుల బాంధవులు పెద్దలు సంఖ్యలో హాజరయ్యారు ..

## కాళేశ్వరంపై పాపాం కడుక్కోండి

**అసెంబ్లీకి వచ్చి నిజాలు చెప్పండి**

**లక్ష కోట్లు ఎలా,ఎందుకు ఖర్చు పెట్టారో చెప్పాలి**

**పేదలకు ఎందుకు ఇళ్లు నిర్మించలేదో చెప్పండి**


**కెసిఆర్‌కు సవాల్ చేసిన మంత్రి పొంగులేటి**

**సిద్దిపేట**

గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి కాళేశ్వరం ప్రాజెక్టు కట్టడానికి లక్షల కోట్ల రూపాయల నిధులు వెచ్చిందని కానీ, పేదవాడికి ఒక సొంత ఇల్లు కట్టించి ఇవ్వడానికి మాత్రం వారికి మనసు రాలేదని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టు కట్టింది వాళ్లే, దాన్ని ఓపెన్ చేసింది వాళ్లే, చివరకు అది కూలిపోయింది కూడా వాళ్ల హయాంలోనేనని మంత్రి గుర్తుచేశారు. ఇప్పుడు వాళ్లే కాళేశ్వరం దగ్గరకు పోయి తామేదో చేశామంటూ కాంగ్రెస్ ప్రభుత్వంపై ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు.సిద్దిపేట జిల్లా ములుగులో లబ్దిదారులకు ఇందిరమ్మ ఇళ్లపట్టాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్మిక శాఖామంత్రి వివేక్ వెంకటస్వామి, జిల్లా కలెక్టర్ హైమావతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. ఈ సందర్భంగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్‌లపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ప్రాజెక్టులో నీళ్లు నిల్వ ఉంచితే కింద ఉన్న ప్రాంతమంతా కొట్టుకుపోతుందని ఎన్‌డీఎస్ఏ హెచ్చరించినా, బీఆర్ఎస్ నేతలు మాట్లాడుతున్న తీరు దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ఎద్దేవా చేశారు. ప్రాజెక్టు కట్టినప్పుడు గత పాలకులకు చిత్తశుద్ధి, నిజాయితీ ఉంటే కాళేశ్వరానికి ఈ గతి పట్టేది కాదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి దుయ్యబట్టారు. కేవలం అధికారం కోసం కాంగ్రెస్ ప్రభుత్వంపై నిందలు మోపడం ఆపాలని హితవు పలికారు. కాళేశ్వరం ప్రపంచంలోనే ఎనిమిదో వింత అన్న పెద్దమనిషి కేసీఆర్ ఇప్పటికైనా అసెంబ్లీకి రావాలి. కాళేశ్వరాన్ని ఎలా కట్టారో సమాధానం చెప్పి.. తాము చేసిన పాపాన్ని అసెంబ్లీ సాక్షిగా కడుక్కోవాలని సవాల్ విసిరారు. వారు ఏవైనా సలహాలు, సూచనలు ఇవ్వాలనుకుంటే అసెంబ్లీ వేదికగా చర్చించడానికి తాము సిద్ధంగా ఉన్నామని, కేసీఆర్ సభకు వచ్చి కాళేశ్వరంపై పూర్తి వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ హయాంలోనే కాళేశ్వరం కట్టారని.. ఆ ప్రాజెక్టు పేరుతో నిధులు మెక్కారని ఎద్దేవా చేశారు. కానీ నిందలేమో తమ ప్రభుత్వంపై వేస్తున్నారని ధ్వజమెత్తారు. ప్రతి విషయాన్ని ప్రజలు గమనిస్తున్నారని.. ప్రతిసారి కర్రు కాల్చి వాత పెడుతున్నారని హెచ్చరించారు. పేదోడి కష్టం తెలియని బీఆర్ఎస్ ప్రభుత్వానికి మాత్రం కాళేశ్వరం కట్టడానికి లక్ష కోట్ల రూపాయలు ఎలా వచ్చాయని మంత్రి పొంగులేటి ప్రశ్నించారు. అధికారం కావాలనే దాహంతో తమ ప్రభుత్వంపై నిందలు మోపడం బీఆర్ఎస్ నేతలు ఆపాలని హితవు పలికారు. చిత్తశుద్ధితో సలహాలు ఇవ్వాలనుకుంటే అసెంబ్లీకి రావాలని కోరారు.

అర్జున్ సమాచారం
www.arjunsamaachaaram.in
తెలుగు దినపత్రిక

# ఆట



## రెండో టి20 కోసం భారత జట్టులో మార్పులు!!

భారత్, ఇంగ్లండ్ జట్ల మధ్య రెండో టి20 శనివారం జరగనుంది. మాంచెస్టర్ వేదికగా ఈ మ్యాచ్ జరగనుంది. తొలి టి20 వర్షం కారణంగా రద్దయిన సంగతి తెలిసిందే. దాంతో ఐదు మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో తొలి పోరు వృధా అయ్యింది. ఐర్లాండ్ చేతిలో టి20 సిరీస్ ఓటమి తర్వాత భారత్ ప్రదర్శనపై చాలా మందిలో అనుమానాలు రేకెత్తాయి. ముఖ్యంగా భారత బ్యాటింగ్ విషయంలో చాలా ప్రశ్నలే మొదలయ్యాయి. ఐర్లాండ్‌తో జరిగిన రెండు మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో భారత జట్టు బ్యాటింగ్ ప్రదర్శన ఘోరంగా ఉంది. ఎన్నడూ లేని విధంగా ఐర్లాండ్ చేతిలో వైట్ వాష్ అయ్యింది. ఇక ఐర్లాండ్ కంటే బలమైన ఇంగ్లండ్‌తో టి20 సిరీస్ కావడం.. టీమిండియా ఫామ్ బాగాలేకపోవడంతో ఈ సిరీస్‌లో భారత ప్రదర్శన ఎలా ఉంటుందనే దానిపై అభిమనుల్లో ఉత్కంఠ నెలకొని ఉంది.ఇక రద్దు అయిన తొలి టి20లో భారత బ్యాటింగ్ ఫర్వాలేదనిపించింది. అభిషేక్ శర్మ, శ్రేయస్ అయ్యర్‌లు అర్ధ సెంచరీలతో కదం తొక్కారు. శివమ్ దూబే మెరుపులు మెరిపించాడు. అయితే సంజూ సామ్సన్ మరోసారి విఫలం అయ్యాడు. కేవలం పరుగుల మాత్రమే చేశాడు. అది కూడా 7 బంతులు ఎదుర్కొని. ఈ క్రమంలో రెండో టి20 కోసం భారత జట్టులో మార్పులు జరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. రెండు మార్పులు జరిగే ఛాన్స్ ఉంది. రవి బిష్ణోయ్ స్థానంలో ప్రిన్స్ యాదవ్‌ను తుది జట్టులోకి తీసుకునే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఐర్లాండ్‌తో జరిగిన రెండో టి20లో ప్రిన్స్ యాదవ్ 3 వికెట్లు తీశాడు. అయితే అనూహ్యంగా అతడిని ఇంగ్లండ్‌తో జరిగిన తొలి టి20 నుంచి పక్కన పెట్టారు. అయితే రెండో టి20లో అతడు బరిలోకి దిగే ఛాన్స్ ఉంది. ఇక చిచ్చర పిడుగు వైభవ్ సూర్యవంశీని తుది జట్టులో తీసుకునే అవకాశాలు కూడా ఉన్నాయి. వరుసగా విఫలం అవుతున్న సంజూ సామ్సన్‌ను పక్కన పెట్టే అవకాశాలు ఉన్నాయి. గత మూడు మ్యాచ్‌ల్లో కలిపి 10 పరుగులు కూడా చేయలేకపోయాడు. దాంతో సంజూను పక్కన పెట్టాలని.. వైభవ్‌కు అవకాశం ఇవ్వాలనే ఒత్తిడి టీమిండియా మేనేజ్‌మెంట్ మీద ఎక్కువ అవుతుంది. ఈ ఏడాది జరిగిన టి20 ప్రపంచకప్‌లో భారత జట్టు ఛాంపియన్‌గా నిలవడానికి ముఖ్య కారణం అయిన సంజూ సామ్సన్‌ను రెండు మ్యాచ్‌ల్లో విఫలం అయినంత మాత్రాన పక్కన పెట్టడం మంచి ఆలోచన

## 36 ఏళ్ల రికార్డును బద్దలు కొట్టిన ఉనై సైమన్

ఫిఫా ప్రపంచ కప్ 2026 లో స్పెయిన్ జట్టు తన విజయ పరంపరను కొనసాగిస్తూ ఘనంగా ప్రీక్వార్టర్స్‌కు చేరుకుంది. టోర్నమెంట్‌లో భాగంగా జరిగిన రౌండ్-32 పోరులో స్పెయిన్ ఏకపక్షంగా ఆస్ట్రియాను 3-0 తేడాతో చిత్తు చేసింది. మ్యాచ్‌లో స్పెయిన్ స్టార్ ప్లేయర్ మైకెల్ 36వ, 89వ నిమిషాల్లో రెండు అద్భుతమైన గోల్స్ సాధించగా, పెడ్రో పోర్రో 66వ నిమిషంలో మరో గోల్ కొట్టి జట్టుకు భారీ విజయాన్ని ఖాయం చేశాడు. ఈ విజయంతో పాటు స్పెయిన్ గోల్ కీపర్ ఉనై సైమన్ ఫుట్‌బాల్ చరిత్రలో ఒక అరుదైన ఘనతను సొంతం చేసుకుని, 36 ఏళ్లనాటి సుదీర్ఘ రికార్డును బద్దలు కొట్టాడు. ప్రపంచకప్ బరిలో ప్రత్యర్థులకు సింహస్వప్నంగా మారిన ఉనై సైమన్, ఏకంగా 519 నిమిషాల పాటు ప్రత్యర్థులను ఒక్క గోల్ కూడా చేయనీయకుండా అడ్డుకుని సరికొత్త ప్రపంచ రికార్డు సృష్టించాడు. దీనితో 1990 వరల్డ్ కప్‌లో ఇటలీ లెజెండరీ ప్లేయర్ వాల్టెర్ జెంగా నెలకొల్పిన 517 నిమిషాల నాటి క్లీన్-షీట్ ఘనతను సైమన్ అధిగమించాడు.గత ప్రపంచ కప్ నుంచి ఈ స్పెయిన్ గోల్ కీపర్ అద్భుత ఆటతీరుకు తిరుగులేకుండా పోయింది. చివరిగా 2022 ప్రపంచ కప్ గ్రూప్ స్టేజ్ మ్యాచ్‌లో జపాన్ జట్టు స్పెయిన్‌పై 51వ నిమిషంలో గోల్ చేసింది. ఆ తర్వాత నుంచి ఇప్పటివరకు జరిగిన ఏ మ్యాచ్‌లోనూ స్పెయిన్ నెట్‌లోకి బంతిని పంపడం ప్రత్యర్థులకు సాధ్యం కాలేదు.ఈసారి లీగ్ స్టేజ్‌లో ఆడిన మూడు మ్యాచుల్లో రెండు విజయాలు, ఒక డ్రాతో గ్రూప్ ఎ లో అగ్రస్థానాన్ని సొంతం చేసుకున్న స్పెయిన్.. ఇప్పుడు నాకౌట్ మ్యాచ్‌లోనూ ఆస్ట్రియాను గోల్ కొట్టనీయకుండా ఉనై సైమన్ అడ్డుకోవడంతో అప్రతిహతంగా దూసుకుపోతోంది. ప్రీక్వార్టర్స్‌లో (రౌండ్-ఆఫ్-16) స్పెయిన్ జట్టు తదుపరి పోరులో క్రిస్టియానో రొనాల్డో నాయకత్వంలోని బలమైన పోర్చుగల్ జట్టుతో తలపడనుంది. ఫిఫా వరల్డ్ కప్ 2026 నాకౌట్ పోరులో అభిమానులను ఉర్రూతలూగించే హై-డ్రామా మ్యాచ్ చోటుచేసుకుంది. స్టార్ స్ట్రైకర్ క్రిస్టియానో రొనాల్డో, యువ సంచలనం గొంకాలో రామోస్ అద్భుత గోల్స్‌తో పోర్చుగల్ జట్టు 2-1 తేడాతో బలమైన క్రొయేషియాను మట్టికరిపించింది. హోరాహోరీగా సాగిన ఈ రౌండ్-ఆఫ్-32 పోరులో విజయం సాధించడం ద్వారా పోర్చుగల్ ప్రిక్వార్టర్స్ (రౌండ్-ఆఫ్-16) కు దూసుకెళ్లింది.



## టీ20తో గ్లోబల్ స్పోర్ట్స్‌గా క్రికెట్

ఇంటర్నేషనల్ క్రికెట్ యొక్క దీర్ఘకాలిక భవిష్యత్తుపై భారత స్పిన్ దిగ్గజం రవిచంద్రన్ అశ్విన్ తీవ్ర సందేహాలు వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో క్రికెట్‌ను ప్రపంచవ్యాప్తంగా విస్తరించడానికి కేవలం టీ20 ఫార్మాట్ మాత్రమే అత్యంత అనుకూలమైనదని ఆయన అభిప్రాయపడ్డారు. తక్కువ సమయంలో ముగిసే మ్యాచ్‌లను ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులు ఎక్కువగా ఇష్టపడతారని, క్రికెట్‌ను ఒక గ్లోబల్ స్పోర్ట్స్‌గా మార్చాలనే ఐసీసీ ఆశయాలకు ఈ ఫార్మాట్ ఎంతో కీలకమని అశ్విన్ పేర్కొన్నారు. క్రికెట్ చరిత్రలోనే ఒక కీలకమైన మలుపు తిరుగుతున్న తరుణంలో అశ్విన్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. దాదాపు 128 సంవత్సరాల సుదీర్ఘ విరామం తర్వాత, 2028 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌లో క్రికెట్ మళ్లీ రీ-ఎంట్రీ ఇవ్వబోతోంది. చివరిగా 1900 పారిస్ ఒలింపిక్స్‌లో మాత్రమే క్రికెట్ పోటీలు జరిగాయి. వీటికి సంబంధించిన అర్హత ప్రమాణాలను కూడా అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ ఇటీవల అధికారికంగా ప్రకటించింది.వార్తా సంస్థ పీటీఐ నివేదిక ప్రకారం అశ్విన్ మాట్లాడుతూ.. "మరో రెండు సంవత్సరాలలో ఒలింపిక్స్ జరగబోతోంది. క్రికెట్‌ను ప్రపంచ స్థాయి క్రీడగా మార్చడంలో ఐసీసీ నిజంగానే సీరియస్‌గా ఉంటే, ప్రస్తుతం నడుస్తున్న వివిధ టీ20 లీగ్‌లలోని జట్లు ఈ విస్తరణలో చాలా కీలక పాత్ర పోషిస్తాయి" అని అన్నారు. అమెరికాలో జరుగుతున్న మేజర్ లీగ్ క్రికెట్ లో 'సాన్ ఫ్రాన్సిస్కో యూనికార్న్స్' జట్టు తరఫున ఆడుతున్న అశ్విన్, ప్రపంచవ్యాప్తంగా ఫ్రాంచైజీ టీ20 లీగ్‌ల వేగవంతమైన వృద్ధి మరియు ఒలింపిక్స్‌లో క్రికెట్ చేరడం వల్ల ఈ క్రీడకు ఆటగాళు మరియు అభిమానుల సంఖ్య విపరీతంగా పెరుగుతుందని విశ్వసిస్తున్నారు.



# ఇవేం ప్రమోషన్లు.. ఇదేం పద్ధతి?..

## జూనియర్లకు పదోన్నతి ఇవ్వడంపై సీనియర్ ఇరిగేషన్ ఇంజినీర్ల ఆగ్రహం

రాష్ట్ర ప్రభుత్వం తీరుపై ఇరిగేషన్‌శాఖ ఇంజినీర్లు మండిపడుతున్నారు. ఇవేం ప్రమోషన్లు.. ఇదేం పద్ధతి అంటూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా ప్రభుత్వం పలువురు ఎస్‌ఈలకు సీఈలుగా, ఈఈలకు ఎస్‌ఈలుగా కల్పించిన ప్రమోషన్లపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. తక్షణం వాటిపై సమీక్షించి సీనియర్లకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇరిగేషన్ డిపార్ట్‌మెంట్‌లో దాదాపు 15 చీఫ్ ఇంజినీర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. సుదీర్ఘకాలంగా ఇన్‌చార్జులతోనే ప్రభుత్వం నెట్టుకొస్తున్నది. ఇంజినీర్ సంఘాలు ఇదే విషయమై కొంతకాలంగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తున్నాయి. ప్రమోషన్లు ఇవ్వాలని, ఇన్‌చార్జ్ పాలనా వ్యవస్థకు స్వస్తి పలుకాలని అసోసియేషన్లన్నీ ముక్తకంఠంతో డిమాండ్ చేస్తున్నాయి. ఎట్టకేలకు ప్రభుత్వం ఆ దిశగా చర్యలు చేపట్టింది. అయితే ఇష్టారీతిన ప్రమోషన్లు ఇవ్వడమే ఇప్పుడు తీవ్ర వివాదాలకు దారితీస్తున్నది. 8 మంది ఎస్‌ఈలకు సీఈలుగా, 15 మంది ఈఈలకు ఎస్‌ఈలుగా ప్రమోషన్ కల్పించాలని నిర్ణయించారు. అందులో భాగంగా ఇటీవలే డిపార్ట్‌మెంటల్ ప్రమోషన్ కమిటీ(డీపీసీ) మీటింగ్ నిర్వహించారు. అందులో ఎస్‌ఈ నుంచి సీఈలుగా పీ సత్యనారాయణ రెడ్డి, శివధర్మతేజ, రాజమ్మ, వాసంతి, సుమతిదేవి, శ్రీదేవి, వరలక్ష్మీదేవి, విద్యావతికి ప్రమోషన్ కల్పిస్తూ కమిటీ ఆమోదం తెలిపింది. ఇదే ఇప్పుడు ఇంజినీర్ల ఆగ్రహానికి కారణం అవుతున్నది. వాస్తవంగా ప్రమోషన్ జాబితాలోని ఆరుగురు ఇంజినీర్లు అనర్హులని చెప్తున్నారు. అదీగాక వారికంటే సీనియారిటీ జాబితాలో ఉన్న ఇంజినీర్లు సైతం ఉన్నారు. సీఈగా ప్రమోషన్ పొందాలంటే ఏడాది పాటు ఎస్‌ఈగా సర్వీస్ పూర్తిచేసి ఉండాలి. దీనినే సాకుగా చూపి ప్రస్తుతం సీనియారిటీ జాబితాలో ముందు వరుసలో ఉన్నా కూడా ఆరుగురు ఇంజినీర్లకు ప్రమోషన్ కల్పించలేదు. అదీగాక మరో నెలరోజులు గడిస్తే సదరు సీనియర్ ఇంజినీర్లు సైతం ఏడాది సర్వీస్ పూర్తి చేసుకొని సీఈ ప్రమోషన్‌కు అర్హత సాధిస్తారు. అయినప్పటికీ ప్రభుత్వం ఆగమేఘాల మీద నిబంధనల సాకుతో ఆ ఇంజినీర్లను పక్కకు పెట్టి తదుపరి సీనియారిటీ జాబితాలో ఉన్న మరో ఆరుగురికి ప్రమోషన్ కల్పించడం వివాదం రేపుతున్నది. ప్రభుత్వం ప్రమోషన్ కల్పించిన వారిలో సైతం పలువురు అనర్హులున్నారని చెప్తున్నారు. ప్రస్తుతం సీఈలుగా ప్రమోషన్ పొందిన ఎస్‌ఈల్లో చాలామందికి ఫీల్డ్ ఎక్స్‌పీరియన్స్ లేదు. కొందరు ఉద్యోగంలో చేరిన నాటినుంచి కార్యాలయ విధుల్లోనే కొనసాగుతున్నారు. డీఈఈ నుంచి ఈఈ, ఆపై ఎస్‌ఈగా ప్రమోషన్ పొందాలంటే రెండేండ్ల పాటు ఫీల్డ్ ఎక్స్‌పీరియన్స్ ఉండాలనేది నిబంధన. అయినప్పటికీ సీనియర్లను వదిలి జూనియర్లకు ప్రమోషన్లు కల్పించడం ఇప్పుడు రాద్ధాంతం రేపుతున్నది. ఇంటర్ స్టేట్ అధికారులపై వివక్ష ఫీల్డ్ ఎక్స్‌పీరియన్స్ లేకున్నా పలువురికి ఎస్‌ఈ నుంచి సీఈలుగా ప్రమోషన్ కల్పించిన ప్రభుత్వం అదే నిబంధన సాకుతో పలువురికి ప్రమోషన్లను నిరాకరించడం సర్కార్ తీరుకు అద్దం పడుతున్నది. ఇరిగేషన్‌శాఖలో, రాష్ట్ర నదీ జలాల హక్కుల పరిరక్షణలో అంతర్రాష్ట్ర జలవిభాగం అనేది అత్యంత కీలకం. ట్రిబ్యునళ్ల అవార్డులు,జలసూత్రాలు, కోర్టు కేసులు, పొరుగు రాష్ట్రాల ప్రాజెక్టులతో రాష్ట్ర జలహక్కులకు భంగం కలుగకుండా చూడడంలో ఈ విభాగమే అత్యంత కీలకం. సుదీర్ఘకాలం పాటు పనిచేస్తేనే ఆయా అంశాలపై అనుభవం, పట్టు లభించే అవకాశం ఉన్నది. అదీగాక ఈ విభాగంలోకి వచ్చేందుకు ఇరిగేషన్‌లోని ఇంజినీర్లు తీవ్ర విముఖత చూపుతున్నారు. ఈ నేపథ్యంలో ఉన్న ఇంజినీర్లతో కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం ఈ విభాగంలో ఎస్‌ఈ పోస్టుతోపాటు, ఈఈ, డీఈఈ తదితర పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఫీల్డ్ ఎక్స్‌పీరియన్స్ నిబంధన నుంచి మినహాయించి తమకు ప్రమోషన్లు కల్పించాలని విభాగం అధికారులు దాదాపు రెండేండ్లుగా ప్రభుత్వానికి మొరపెట్టుకుంటున్నారు. అయినప్పటికీ ప్రభుత్వం ఏమాత్రం పట్టించు కోవడం లేదు. నిబంధన సాకుతో ప్రమోషన్లు కల్పించడం లేదు. ఇన్‌చార్జులుగా ఉన్న ఇంజినీర్లకే అదనపు బాధ్యతలు అప్పగించి చేతులు దులుపుకొన్నది. కానీ ప్రస్తుతం ఫీల్డ్ ఎక్స్‌పీరియన్స్ లేకున్నా కూడా పలువురు ఎస్‌ఈలకు సీఈలుగా ప్రమోషన్లు కల్పించడం గమనార్హం. ఇదే విషయమై జలసౌధలో ఇంజినీర్లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సకాలంలో ప్రమోషన్లు కల్పించకుండా తాత్సారం చేయడంతో సీనియర్ ఎస్‌ఈలు ప్రస్తుతం సీఈగా ప్రమోషన్లు పొందలేని దుస్థితి నెలకొన్నదని వివరిస్తున్నారు. ఇకనైనా సర్కార్ వెసులుబాటు కల్పించి, సీనియర్లకే సీఈలుగా అవకాశం కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

## పిల్లలపై అభ్యంతరకర యాడ్స్ తొలగించండి.. మెటాకు కేంద్రం నోటీసులు

పిల్లలపై అభ్యంతరకర యాడ్స్ ప్రసారం చేస్తున్న ఇన్‌స్టాగ్రామ్‌పై కేంద్రం ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ కంటెంట్ వెంటనే తొలగించాలంటూ ఇన్‌స్టాగ్రామ్ యాజమాన్య సంస్థ మెటాకు కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. అంతేకాదు.. ఈ అంశానికి సంబంధించిన పూర్తి వివరాలతో వారం రోజుల్లోగా సమాధానం ఇవ్వాలంటూ నోటీసులు జారీ చేసింది. ఈ మేరకు కేంద్ర ఎలక్ట్రానిక్స్ అడ్ ఐటీ శాఖ ఆదివారం నోటీసులు జారీ చేసింది. ఇన్‌స్టాగ్రామ్‌లో పిల్లలపై లైంగిక దాడిని ప్రోత్సహించేలా అభ్యంతరకర పెయిడ్ యాడ్స్ వస్తున్నట్లు కేంద్రం గుర్తించింది. ఈ తరహా యాడ్స్‌ను, కంటెంట్‌ను తొలగించాలంటూ ఆదేశాలిచ్చింది. ఇన్‌స్టాగ్రామ్‌లో పిల్లల గురించి ప్రసారమవుతున్న అభ్యంతరకర యాడ్స్‌పై ఇటీవల బీబీసీ ఒక కథనం ప్రచురించింది. దీనిపై సర్వత్రా విమర్శలు వ్యక్తమయ్యాయి. దీనిపై స్పందించిన కేంద్ర ఐటీ శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్ స్పందిస్తూ.. మెటాకు నోటీసులు జారీ చేయాలని కేంద్ర ఎలక్ట్రానిక్స్ అడ్ ఐటీ శాఖ అధికారులకు ఆదేశాలిచ్చారు. దీంతో ఈ శాఖ ఆదివారం మెటాకు నోటీసులు ఇచ్చింది. ఈ యాడ్స్‌ను కట్టడి చేసేందుకు ఎలాంటి చర్యలు తీసుకున్నారో తెలపాలని సూచించింది. భవిష్యత్తులో ఇలాంటివి జరగకుండా ఎలాంటి విధానాలు పాటిస్తారో చెప్పాలని ఆదేశించింది. ఇలాంటి అసభ్యకర కంటెంట్‌ను ఎలా అనుమతించారని ప్రశ్నించింది. అలాగే, మెటా ఇచ్చే వివరణ సంతృప్తికరంగా లేకుంటే సంస్థపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఇప్పటికే సోషల్ మీడియా ద్వారా అసభ్యకర కంటెంట్ ప్రసారమవుతోందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ యాప్‌లను కొందరు దుర్వినియోగం చేస్తున్నారని, చట్ట వ్యతిరేక, పిల్లలపై లైంగిక చర్యలకు సంబంధించిన కంటెంట్‌ను ప్రమోట్ చేస్తున్నారనే విమర్శ ఎప్పటినుంచో ఉంది. బీబీసీ కథనాలతో ఈ అంశం మరోసారి తెరమీదకు వచ్చింది. ఇన్‌స్టాగ్రామ్‌పై వచ్చే పిల్లలకు సంబంధించిన అభ్యంతరకర యాడ్స్‌పై క్లిక్ చేస్తూ అది టెలిగ్రామ్‌లోకి ఓపెన్ అవుతుంది. అక్కడికి వెళ్తే రూ.99కే అభ్యంతరకర కంటెంట్ అంటూ వీడియోలు ఉంటున్నాయి. ఇది థర్డ్ పార్టీకి సంబంధించిన యాప్ అయినప్పటికీ.. దీని ద్వారా మెటాకు ఆదాయం వస్తుంది కాబట్టి.. మెటానే దీనికి బాధ్యత వహించాల్సి ఉంటుందని కేంద్రం తెలిపింది.

## ఆత్మహత్య ఆలోచనలు డాక్టర్లలోనే ఎక్కువ..

### ఫైమా సర్వేలో సంచలన విషయాలు వెలుగులోకి!

ప్రజారోగ్యానికి వెన్నెముకలా నిలిచే వైద్యులు పనిభారంతో సతమతం అవుతున్నారు. తీవ్రమైన ఒత్తిడి కారణంగా ఆత్మహత్య ఆలోచనలు చేస్తుండటం తీవ్ర ఆందోళన రేపుతున్నది. తాజాగా ది ఫెడరేషన్ ఆఫ్ ఆల్ ఇండియా మెడికల్ అసోసియేషన్(ఫైమా) దేశవ్యాప్తంగా 'రివ్యూ మెడికల్ సిస్టమ్(ఆర్ఎంఎస్) 2.0' పేరిట నిర్వహించిన సర్వే వైద్యులు ఎదుర్కొంటున్న సమస్యలను వెలుగులోకి తెచ్చింది. దేశవ్యాప్తంగా 28 రాష్ట్రాలు, యూటీలు కలిపి 1,260 మంది రెసిడెంట్ డాక్టర్ల నుంచి సేకరించిన డాటా ఆధారంగా ఈ సర్వే రూపొందించినట్టు ఫైమా తెలిపింది. ఇందులో 87.5 శాతం మంది తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురవుతున్నట్టు తేలింది. 87.8 శాతం మంది నిద్రలేమి సమస్యలతో బాధపడుతున్నట్టు వెల్లడించింది. 61.8 శాతం మంది 36 గంటలు నిరంతరాయంగా పనిచేస్తున్నట్టు పేర్కొన్నది. 63.7 శాతం డ్యూటీ పూర్తయిన తర్వాత కనీసం విశ్రాంతి కూడా తీసుకోవడం లేదని వెల్లడించింది. ఈ కారణాలతో 54.4 శాతం మంది రెసిడెన్సీ(తమ పీజీ సీటు) వదిలి వెళ్లిపోవాలని ఆలోచిస్తున్నారని వివరించింది. 16.9 శాతం మంది ఆత్మహత్య ఆలోచనలు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేసింది. 69.1 శాతం మంది తీవ్రమైన పని భారం ఉందని తెలిపారు. 46.7 శాతం మంది వారానికి 80 గంటలు పని చేస్తున్నామని, 20.3 శాతం మంది వారానికి 100 గంటలకు పైగా పనిచేస్తున్నామని వెల్లడించారు. ఆరోగ్యరంగంలో సిబ్బంది కొరత, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరిచే వ్యవస్థ లేకపోవడం, సకాలంలో స్టైఫండ్ అందకపోవడం, బాండ్ పాలసీలు (కోర్సు మధ్యలో వదిలి వెళితే విధించే భారీ జరిమానాలు), పనిభారంతో అకడమిక్ కోర్సుపై ఎఫెక్ట్ పడుతున్నదని సర్వే ఆందోళన వ్యక్తం చేసింది.

### తీసుకురావాల్సిన సంస్కరణలు ఇలా..

రెసిడెంట్ డాక్టర్ల సంరక్షణకు తక్షణమే ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని సర్వే సూచించింది. రెసిడెంట్ డాక్టర్ల పనివేళలపై జాతీయ స్థాయిలో సంస్కరణలు తీసుకురావాలని డిమాండ్ చేసింది. ఎక్కువ సేపు షిఫ్టుల్లో పనిచేసిన తర్వాత విశ్రాంతి తీసుకోవడం తప్పనిసరి చేయాలని, వైద్యుల కొరతను తీర్చేందుకు వెంటనే నియామకాలు చేపట్టాలని పేర్కొన్నది. ఏకధాటిగా 36 గంటల డ్యూటీలు వేయవద్దని కోరింది. ప్రతి మెడికల్ కాలేజీలో మానసిక ఆరోగ్య కౌన్సిలింగ్ సేవలు అందుబాటులో ఉంచడంతో పాటు దేశవ్యాప్తంగా ఒకే విధమైన స్టైఫండ్ విధానం అమలు చేయాలని, బాండ్ పాలసీ, జరిమానాల్లో సవరణలు చేయాలని, ఎప్పటికప్పుడు రెసిడెంట్ డాక్టర్ల సంక్షేమాన్ని మానిటరింగ్ చేసే వ్యవస్థను రూపొందించాలని సూచించింది. రోగుల భద్రత, నాణ్యమైన వైద్య విద్యను దృష్టిలో ఉంచుకొని రెసిడెంట్ డాక్టర్ల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే పరిష్కరించాలని సర్వే అభిప్రాయపడింది.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి: జిల్లా కలెక్టర్ మను చౌదరి



మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ప్రజలు తరలివచ్చారు. లా ఆఫీసర్ చంద్రావతి, డీఆర్ఓ మాలతిలతో కలిసి జిల్లా కలెక్టర్ మను చౌదరి, అదనపు కలెక్టర్ అర్జీదారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి మొత్తం 79 దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. అనంతరం కలెక్టర్ మను చౌదరి అధికారులను ఉద్దేశించి మాట్లాడుతూ పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ప్రజావాణిలో ప్రజల నుంచి స్వీకరించిన దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులకు అందజేసి, ఎలాంటి జాప్యం లేకుండా సత్వరమే వాటిని పరిశీలించి పరిష్కరించాలని ఆయన ఆదేశించారు. ఎంతో వ్యయప్రయాసలకోర్చుకుని, తమ సమస్యలు కచ్చితంగా పరిష్కారం అవుతాయనే గట్టి నమ్మకంతో ప్రజలు అధికారుల వద్దకు వస్తారని, వారి నమ్మకాన్ని నిలబెట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని కలెక్టర్ గుర్తుచేశారు. దరఖాస్తుల పరిశీలనలో నిర్లక్ష్యం వహించకూడదని ఆయన స్పష్టం చేశారు. అలాగే, నిబంధనల ప్రకారం పరిష్కరించలేని దరఖాస్తులను తిరస్కరించాల్సి వస్తే, ఆ తిరస్కరణకు గల నిర్దిష్ట కారణాలను అర్జీదారులకు తప్పనిసరిగా వివరంగా తెలియజేయాలని అధికారులకు సూచించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకుంటున్న చర్యలు, పరిష్కరించిన వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా ఉన్నతాధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను వేగవంతం చేయాలి: కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ



న్యూఢిల్లీలో నేషనల్ హైవేస్ లాజిస్టిక్స్ మేనేజ్మెంట్ లిమిటెడ్ కు సంబంధించిన ప్రాజెక్టుల పురోగతిపై కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో దేశవ్యాప్తంగా అభివృద్ధి చేస్తున్న మల్టీ మోడల్ లాజిస్టిక్స్ పార్కులు, రోప్ వేలు, ఇంటర్ మోడల్ స్టేషన్లు, రహదారి పక్కన కల్పిస్తున్న ప్రయాణికుల సదుపాయాల నిర్మాణ పురోగతిని ఆయన అంచనా వేశారు. ఈ ప్రాజెక్టులన్నింటినీ ఎట్టి పరిస్థితుల్లోనూ త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. భవిష్యత్తుకు అవసరమైన సమీకృత రవాణా వ్యవస్థను నిర్మించడంలో ఈ ప్రాజెక్టులు ఎంతో వ్యూహాత్మకమైనవని, అత్యంత కీలకమైనవని మంత్రి నొక్కిచెప్పారు. ఈ సరికొత్త మౌలిక సదుపాయాల ద్వారా రవాణా కనెక్టివిటీ బలోపేతం కావడంతో పాటు, కొత్త ఆర్థిక అవకాశాలు అందుబాటులోకి వస్తాయని ఆయన పేర్కొన్నారు. దీనివల్ల దేశంలో సమతుల్య ప్రాంతీయ అభివృద్ధి జరుగుతుందని, తద్వారా భారతదేశ రవాణా రంగంలో పోటీతత్వం మరింత పెరుగుతుందని మంత్రి వివరించారు. ప్రాజెక్టుల అమలులో ఎదురవుతున్న ప్రధాన సవాళ్లను గడ్కరీ ఈ సందర్భంగా సమీక్షించారు. ప్రాజెక్టుల నిర్మాణంలో ఉన్న అడ్డంకులను ప్రాధాన్యతా క్రమంలో వెంటనే పరిష్కరించి, పనులను వేగవంతం చేయాలని సంబంధిత అధికారులందరినీ ఆయన ఆదేశించారు. ఈ ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేయడం వల్ల రవాణా సామర్థ్యం మెరుగుపడటమే కాకుండా, రవాణా ఖర్చులు గణనీయంగా తగ్గుతాయన్నారు. ప్రయాణికులకు ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని, ఇది వికసిత్ భారత్, ఆత్మనిర్భర్ భారత్ ఆశయ సాధనకు మరింతగా దోహదపడుతుందని మంత్రి నితిన్ గడ్కరీ స్పష్టం చేశారు.

## పెహల్గామ్ ఉగ్రదాడి.. ఎన్ఐఏ ఛార్జ్‌షీట్‌లో లష్కరే చీఫ్ హాఫీజ్ సయీద్ పేరు

జమ్మూకశ్మీర్‌లోని పెహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి ఘటనకు సంబంధించిన దర్యాప్తులో కీలక అడుగు పడింది. ఆ కేసులో జాతీయ దర్యాప్తు సంస్థ ఎన్ఐఏ కీలక నిందితుల పేర్లను తన ఛార్జ్‌షీట్‌లో చేర్చింది. పాకిస్థాన్‌కు చెందిన లష్కరే తోయిబా, ద రెసిస్టెంన్స్ ఫ్రంట్ వ్యవస్థాపకుడు హాఫీజ్ సయీద్ పేరును కూడా ఆ ఛార్జ్‌షీట్‌లో చేర్చారు. జమ్మూలోని ఎన్ఐఏ స్పెషల్ కోర్టులో మంగళవారం నాడు సప్లిమెంటరీ ఛార్జ్‌షీట్‌ను దాఖలు చేశారు. భారతీయ న్యాయ సంహితలోని సెక్షన్లు, యూఏపీఏ చట్టం ప్రకారం హాఫీజ్‌పై నేరాభియోగం నమోదు చేశారు. భారత్‌పై యుద్ధం చేపట్టేందుకు రెచ్చగొట్టినట్లు కూడా శిక్షా స్మృతి కింద కేసు బుక్ చేశారు. కుట్రకు పాల్పడినట్లు ఛార్జ్‌షీట్‌లో ఆరోపించారు. 1597 పేజీలతో కూడిన ఛార్జ్‌షీట్‌ను గతంలో ఎన్ఐఏ తయారు చేసింది. అయితే పాకిస్థాన్‌కు చెందిన హాఫీజ్ కుట్రపన్నినట్లు వివరాల్లో వెల్లడించారు. శాస్త్రీయపద్ధతిలో దర్యాప్తు చేపట్టిన తర్వాత ఎన్ఐఏ ఈ కేసులో దానికి సంబందించిన ఆధారాలను సేకరించినట్లు తెలిసింది. 2025 డిసెంబర్ 15వ తేదీన నమోదు చేసిన ఛార్ఝ్ షీట్‌లో పాకిస్తాన్ ఉగ్రవాది సాజిద్ జాట్ పేరు కూడా ఉన్నది. ఇక 2025 జూలైలో జరిగిన ఆపరేన్ మహాదేవ్‌లో ముగ్గురు ఉగ్రవాదులు హతమయ్యారు. మరో ఇద్దరు నిందితులను అరెస్టు చేశారు. పెహల్గామ్ ఉగ్రదాడి ప్లానింగ్, అమలు మొత్తం లష్కరే, టీఆర్ఎఫ్ ఉగ్ర సంస్థ ఆధ్వర్యంలో జరిగినట్లు ఛార్జ్‌షీట్‌లో పేర్కొన్నారు. 2025 ఏప్రిల్ 22వ తేదీన జమ్మూకశ్మీర్‌లోని పెహల్గామ్‌లో పాక్ ఉగ్రవాదులు మతం పేరు అడిగి మరీ కాల్పులకు పాల్పడిన విషయం తెలిసిందే. సుమారు 25 మంది టూరిస్టులు, ఓ స్థానిక వ్యక్తి ఆ కాల్పుల్లో



మృతిచెందారు. అనంత్‌నాగ్‌లో ఉన్న పెహల్గామ్ పోలీసు స్టేషన్‌లో తొలుత ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ప్రాథమిక విచారణ తర్వాత ఈ కేసును ఎన్ఐఏకు బదిలీ చేశారు. పెహల్గామ్ ఉగ్రదాడి ఘటనలో పాక్ కుట్రను తేల్చేందుకు ఎన్ఐఏ ఈ కేసును లోతుగా దర్యాప్తు చేస్తోంది.

## ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు కలెక్టర్ ఆదేశం

రంగారెడ్డి జిల్లాలో ఓటర్ల నమోదు ప్రక్రియను పారదర్శకంగా మరియు సకాలంలో పూర్తి చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్ రెడ్డి జిల్లా కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టిన ఈ కార్యక్రమంపై ఆయన సోమవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఓటర్ల నమోదు అధికారులు మరియు సూపర్వైజర్లు ప్రజలతో మర్యాదపూర్వకంగా వ్యవహరిస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఫారాలను పంపిణీ చేయాలని ఆయన సూచించారు. ప్రజాప్రతినిధులు మరియు ప్రజా సంఘాలను భాగస్వాములను చేస్తూ క్షేత్రస్థాయిలో పక్కాగా వివరాలు సేకరించాలని ఆయన ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న జిల్లా కలెక్టర్ సి. నారాయణ రెడ్డి, జిల్లాలో ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ ఇప్పటికే ఎనభై ఎనిమిది శాతానికి పైగా పూర్తయిందని వివరించారు. మిగిలిన ప్రక్రియను కూడా వేగవంతం చేసేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని ఆయన తెలిపారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా క్షేత్రస్థాయిలో ప్రత్యేక సహాయ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ వెల్లడించారు. వచ్చే ఏడు రోజుల్లోనే ఫారాల పంపిణీ, స్వీకరణ మరియు డిజిటైజేషన్ పనులను పూర్తి చేసేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కందుకూరు రెవెన్యూ డివిజనల్ అధికారి జగదీశ్వర్ రెడ్డితో పాటు జిల్లా ఎన్నికల విభాగం మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.



# కామ్రేడ్ కాల్వ నరసయ్య యాదవ్ 7వ వర్ధంతి వేడుకలు

**కరీంనగర్, అర్జున్ సమాచారం, జూలై 6, 2026**

కరీంనగర్ జిల్లా కేంద్రంలోని బొమ్మకల్లు గ్రామంలో తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సంఘం రాష్ట్ర వ్యవస్థాపకులు స్వర్గీయులు కాల్వ నర్సయ్య యాదవ్ 7వ వర్ధంతి వేడుకల్లో పాల్గొన్నా తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కటిక రెడ్డి బుచ్చన్న యాదవ్. రాష్ట్ర కార్యదర్శి కడారి ఐలయ్య పాల్గొన్నారు ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ కొమ్ము అశోక్ యాదవ్‌లి మాట్లాడుతూ " యాదవ జాతిరత్నం బడుగు బలహీన వర్గాలకు ఆశాజ్యోతి గా నిలిచిన మన నాయకుడు అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కరీంనగర్ జిల్లా సహకార యూనియన్ చైర్మన్ గా మరియు తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సంఘం వ్యవస్థాపకులు రాష్ట్ర అధ్యక్షులు గా స్వర్గీయులు కామ్రేడ్ కాల్వ నరసయ్య యాదవ్ గారు పదవులు చేసి పేదల గొల్ల కురుమల కోసం, గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సమస్యలు ఆర్థిక అభివృద్ధి కోసం తన తుది శ్వాస ఉన్నంతవరకు జీవితాంతం పోరాడారు. లేబర్ యూనియన్ లీడర్ గా ఆమాలి సంఘాలకు రిక్షా కార్మికులకు నాయకత్వం వహిస్తూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకున్నారు కేసీఆర్ గొర్రెల పంపిణీ కార్యక్రమం చేపట్టడానికి కీలకమైన పాత్ర పోషించి భారతదేశ రాజధాని అయిన ఢిల్లీలో జంతర్ మంతర్ దగ్గర ధర్నా కార్యక్రమాలు చేపట్టి తెలంగాణ రాష్ట మాజీ పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ గారితో మాజీ ఆర్థిక శాఖ మంత్రి ఈటల రాజేందర్ గారితో ప్రతి జిల్లా కలెక్టర్లతో స్టేట్ డైరెక్టర్ తో జిల్లా ల్లో జెడి లతో సంప్రదింపులు చేసి రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి సహకార సంఘాల సమస్యలను తీసుకువెళ్లి కెసిఆర్ గొర్రెల పంపిణీ కార్యక్రమం చేపట్టేలా కీలకమైన పాత్ర పోషించిన గొప్ప ఉద్యమకారుడు ఇలా అనేక సేవలు చేసిన ఆ మహనీయుని స్ఫూర్తితో ఆయన బాటలోనే మేము నడుస్తూ ఆయన స్థాపించిన తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సంఘాన్ని ముందుకు తీసు వెళ్తాఅన్నము కాల్వ



నరసయ్య యాదవ్ గారు కరీంనగర్ జిల్లా కేంద్రంలో 2014వ సంవత్సరంలో మాజీ ఎంపీగా ఉన్న పొన్నం ప్రభాకర్ తో ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి రఘువీరారెడ్డి యాదవ్ గార్లతో భూమి ఇందిరా గార్డెన్ వద్ద యాదవ మార్కెట్ యాడ్ వరసంత కోసంస్థలాన్ని పోరాడి సాధించాడు ఇలా ఆయన చేసిన సేవలు ఎన్నో వున్నాయి అని స్మరించుకుంటూ ఆశయాలను సాధిస్తామని ఆయన చేసిన సేవలు, త్యాగాలు ఎప్పటికీ మరువలేనివి" అని 'బడుగు బలహీన వర్గాలకు ఆశాజ్యోతిగా నిలిచిన కాల్వ నరసయ్య యాదవ్ గారి ఆశయాలను సజీవంగా ఉంచుతూ, ప్రభుత్వం నుండి గొర్రెల మేకల పెంపకందారులకు రావాల్సిన వాటని న్యాయంగా సాధించేందుకు కృషి చేస్తాం" అని బొమ్మ కల్ను లోని ఆయన స్తూపానికి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కాల్వ నరసన్న కుటుంబ సభ్యులు వారి సతీమణి కాల్వ లక్ష్మికూతురు కాల్వ జ్యోతి కుమారుడు సంఘం రాష్ట్ర కోశాధికారి కాల్వ శ్రీనివాస్ యాదవ్ నవీన్ యాదవ్ కరీంనగర్ జిల్లా యాదవ సంఘం వ్యవస్థాపకులు మంచాల పోచన్న యాదవ్, తెలంగాణ రాష్ట్ర గొర్రెల మేకల పెంపకం వృత్తిదారుల సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షులు చిగుర్ల శ్రీనివాస్, యాదవ సంఘం కరీంనగర్ జిల్లా మహిళా అధ్యక్షురాలు సందెనవేణి గీతాంజలి ,అఖిల భారత యాదవ మహా సభ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు మంచాల రవీందర్ యాదవ్, భూపాల్లజ్జి రమేష్ యాదవ్, మంచిర్యాల జిల్లా అధ్యక్షులు చిల్లారపు సంతోష్ యాదవ్, చెందు, యాదవ సంఘం మాజీ కరీంనగర్ జిల్లా అధ్యక్షులు మాజీ సర్పంచ్ ధుంద్ర రాజన్న యాదవ్ ,యాదవ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కాల్వ మల్లేష్ యాదవ్, కరీంనగర్ మండల అధ్యక్షులు రాజు యాదవ్, జంగ తిరుపతి యాదవ్, మన్నవేని కొమురయ్య యాదవ్, బాగోతం వీరయ్య యాదవ్ ,జక్కుల ఆగయ్య యాదవ్ నాయకులు పాల్గొన్నారు

## కిష్టంపేటలో ఘనంగా డా. శ్యామా ప్రసాద్ ముఖర్జీ 125వ జయంతి వేడుకలు:



**అర్జున్ సమాచారం, మంచిర్యాల జిల్లా ప్రతి నిధి, జూలై 6, 2026:**

చెన్నూర్ మండలోని కిష్టంపేట గ్రామంలో భారతీయ జనసంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ గారి 125వ జయంతి వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. బిజెపి చెన్నూర్ మండల అధ్యక్షులు బుర్ర రాజశేఖర్ గౌడ్ గారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం విజయవంతంగా జరిగింది. గ్రామ బస్టాండ్ ఆవరణలోని బిజెపి జెండా వద్ద శ్యామా ప్రసాద్ ముఖర్జీ గారి చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా దేశ ఐక్యతకు, సమగ్రతకు ఆయన చేసిన త్యాగాలను స్మరించుకున్నారు. అనంతరం జయంతి ఉత్సవాల సందర్భంగా స్థానికులకు మిఠాయిలు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా కౌన్సిలర్ హాజరు:ఈ కార్యక్రమానికి చెన్నూరు 18వ వార్డు కౌన్సిలర్ ఏతం శివకృష్ణ ముఖ్య అతిథిగా విచ్చేశారు. జయంతి వేడుకల్లో భాగంగా పర్యావరణ పరిరక్షణను కాంక్షిస్తూ బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో నాయకులు, కార్యకర్తలు కలిసి మొక్కలు నాటారు. నాటిన మొక్కలను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఈ సందర్భంగా నేతలు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు ముంజం నారాయణ, జిముడ రాజారాం, జీల మల్లేష్, శేఖర్, నరేష్, కొట్రంగి సమ్మయ్యతో పాటు పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రజా ఫిర్యాదులపై తక్షణ స్పందన.. చట్టపరిధిలో పరిష్కారానికే ప్రాధాన్యం: పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా



**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూలై 06:**

రామగుండం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల కార్యక్రమంలో కమిషనరేట్ పరిధిలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల ఫిర్యాదులను పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా నేరుగా స్వీకరించారు.ఈ సందర్భంగా ప్రతి ఫిర్యాదుదారుడి సమస్యను శ్రద్ధగా విన్న పోలీస్ కమిషనర్ సంబంధిత స్టేషన్ హౌస్ అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ఫిర్యాదుల వివరాలను తెలుసుకున్నారు. చట్టపరిధిలో సత్వర పరిష్కారం కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ఈ సందర్భంగా అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ బాధితులకు న్యాయం చేయడమే పోలీసు శాఖ ప్రధాన బాధ్యత అని, ప్రజలు ఎలాంటి సమస్యలు ఎదురైనా నిర్భయంగా పోలీసులను ఆశ్రయించాలని సూచించారు. భూ వివాదాలకు సంబంధించిన అంశాలు ప్రధానంగా సివిల్ స్వభావం కలిగినవని, అలాంటి వివాదాలను సంబంధిత న్యాయస్థానాల ద్వారానే పరిష్కరించుకోవడం శాశ్వతమైన, చట్టబద్ధమైన మార్గమని తెలిపారు.ఎవరూ చట్టాన్ని తమ చేతుల్లోకి తీసుకుని దాడులు, గొడవలకు పాల్పడరాదని, శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. ఏవైనా వివాదాలు లేదా సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే పోలీసులను ఆశ్రయించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (పరిపాలన) కె. శ్రీనివాస్ పాల్గొన్నారు.

## సీఎంఆర్ బియ్యం అక్రమ దారిమళ్లింపు నిందితుడిపై పీడీ యాక్ట్ అమలు

**ప్రభుత్వ ధాన్యాన్ని దోచుకునే వారిపై ఉక్కుపాదం: పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**

పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూలై 06: ప్రభుత్వ ధాన్యాన్ని అక్రమంగా దారి మళ్లించి ప్రజల ఆహార భద్రతకు భంగం కలిగించే వారిపై కఠిన చర్యలు కొనసాగుతున్నాయని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. ఈ నేపథ్యంలో కరీంనగర్ జిల్లా కట్టరాంపూర్‌కు చెందిన బండారి మారుతి (43), కాట్నపల్లిలోని సాయి మహాలక్ష్మి ఇండస్ట్రీస్, సౌభాగ్యలక్ష్మి ఇండస్ట్రీస్ మేనేజింగ్ పార్ట్నర్‌పై ప్రివెన్షన్ ఆఫ్ బ్లాక్ మార్కెటింగ్ అండ్ మెయింటెనెన్స్ ఆఫ్ సప్లైస్ ఆఫ్ ఎసెన్షియల్ కమోడిటీస్ యాక్ట్--1980 కింద ప్రివెంటివ్ డిటెన్షన్ (పీడీ) యాక్ట్ అమలు చేసినట్లు వెల్లడించారు.పోలీస్ కమిషనర్ ఉత్తర్వుల మేరకు సుల్తానాబాద్ సీఐ పి. రంజిత్‌రావు, ఎస్సై చంద్రకుమార్ కరీంనగర్ జిల్లా జైలుకు వెళ్లి జైలర్ సమక్షంలో నిందితుడికి పీడీ యాక్ట్ ఉత్తర్వులు అందజేసి, అనంతరం చర్లపల్లి కేంద్ర కారాగారానికి తరలించారు.దర్యాప్తులో వెల్లడైన వివరాల ప్రకారం, 2023--24 రబీ, ఖరీఫ్ సీజన్లలో తెలంగాణ రాష్ట్ర పౌర సరఫరాల సంస్థతో కస్టమ్ మిల్లింగ్ ఒప్పందం కుదుర్చుకున్న నిందితుడు 11,213.040 మెట్రిక్ టన్నుల వరిని స్వీకరించి, ప్రభుత్వానికి అప్పగించాల్సిన 7,624.867 మెట్రిక్ టన్నుల సీఎంఆర్ బియ్యాన్ని అందజేయకుండా ఇతర రైస్ మిల్లులకు అక్రమంగా విక్రయించినట్లు తేలింది. ఈ వ్యవహారంతో ప్రభుత్వానికి రూ.27 కోట్లకు పైగా నష్టం వాటిల్లినట్లు దర్యాప్తులో నిర్ధారణ అయింది.నిందితుడిపై 2024 నుంచి 2026 మధ్య పెద్దపల్లి, కరీంనగర్ జిల్లాల్లో నాలుగు క్రిమినల్ కేసులు నమోదయ్యాయని పోలీసులు తెలిపారు. ఒక కేసులో బెయిల్‌పై విడుదలైన తర్వాత కూడా ఇదే తరహా



నేరాలకు పాల్పడినట్లు గుర్తించినట్లు పేర్కొన్నారు. ప్రస్తుతం మరో కేసులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న నిందితుడు విడుదలైతే మళ్లీ ప్రజా పంపిణీ వ్యవస్థకు భంగం కలిగించే అవకాశం ఉన్నందున ప్రజా ప్రయోజనాల దృష్ట్యా పీడీ యాక్ట్ అమలు చేసినట్లు వివరించారు.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా మాట్లాడుతూ ప్రభుత్వ ధాన్యం పేదల హక్కు అని, దానిని బ్లాక్ మార్కెట్‌కు తరలించే వారిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమన్నారు. సాధారణ క్రిమినల్ కేసులతోనే కాకుండా అవసరమైతే పీడీ యాక్ట్‌తో పాటు చట్టంలో ఉన్న కఠిన నిబంధనలను కూడా అమలు చేస్తామని హెచ్చరించారు. సీఎంఆర్ బియ్యం అక్రమ దారిమళ్లింపులో ప్రత్యక్షంగా, పరోక్షంగా పాల్గొన్న ప్రతి ఒక్కరిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ కేసులో పీడీ యాక్ట్ అమలుకు కృషి చేసిన పెద్దపల్లి ఏసీపీ కృష్ణ, సుల్తానాబాద్ సీఐ పి. రంజిత్‌రావు, ఎస్సై చంద్రకుమార్‌లను పోలీస్ కమిషనర్ అభినందించారు.

# లైఫ్ సైన్సెస్ ఆవిష్కరణల కేంద్రంగా తెలంగాణ: మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

### దేశంలోనే తొలి ఇంటిగ్రేటెడ్ ఆంకాలజీ మ్యానుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీ ప్రారంభం

**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూలై 06:**



ఆరోగ్య రంగంలో వేగంగా చోటు చేసుకుంటున్న మార్పులను అవకాశాలుగా మలుచుకుంటూ తెలంగాణను ప్రపంచ స్థాయి లైఫ్ సైన్సెస్ ఆవిష్కరణల కేంద్రంగా తీర్చిదిద్దుతున్నామని రాష్ట్ర



ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. సిద్దిపేట జిల్లా మర్కూక్ మండలం కరకపట్ల బయోటెక్ పార్క్ ఫేజ్--3లో రూ.800 కోట్ల పెట్టుబడితో సిరో ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ ఏర్పాటు చేసిన దేశంలోనే తొలి ఇంటిగ్రేటెడ్ ఆంకాలజీ మ్యానుఫ్యాక్చరింగ్ ఫెసిలిటీని సోమవారం ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ పరిశోధన, సాంకేతికత, కృత్రిమ మేధస్సు, అధునాతన తయారీ, నైపుణ్యాభివృద్ధిని సమన్వయం చేస్తూ భవిష్యత్ ఆరోగ్య రంగ అవసరాలకు అనుగుణంగా సమగ్ర ఎకోసిస్టమ్‌ను రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి చేస్తోందన్నారు. తెలంగాణను పారిశ్రామిక రంగంలో దేశానికి ఆదర్శంగా నిలిపే లక్ష్యంతో పనిచేస్తున్నామని, జహీరాబాద్ నిమ్జ్‌ను మోడల్ మ్యానుఫ్యాక్చరింగ్ జోన్‌గా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించామని తెలిపారు.రాష్ట్రంలో గ్రీన్ ఫార్మా అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, పర్యావరణహిత పద్ధతుల్లో ఔషధాల తయారీకి పరిశ్రమలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు. తెలంగాణ నుంచే ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందే కొత్త ఔషధ మాలిక్యూల్ ఆవిష్కృతం కావాలన్నదే ప్రభుత్వ ఆకాంక్ష అని పేర్కొన్నారు.తెలంగాణ రైజింగ్--2047, నెక్స్ట్ జనరేషన్ లైఫ్ సైన్సెస్ పాలసీల ద్వారా పరిశోధన నుంచి ఉత్పత్తి వరకు అన్ని దశలను అనుసంధానించే ప్రత్యేక వ్యవస్థను నిర్మిస్తున్నామని తెలిపారు. బయోలాజిక్స్, బయోసిమిలర్స్, సెల్ అండ్ జీన్ థెరపీలు, కృత్రిమ మేధస్సు, డిజిటల్ హెల్త్ వంటి అత్యాధునిక రంగాలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భారత్ ఫ్యూచర్ సిటీ, హిల్ట్ పాలసీలపై ప్రతిపక్షాలు కావాలనే దుష్ప్రచారం చేస్తున్నాయని, గత రెండున్నరేళ్లలో రాష్ట్రం సాధించిన పారిశ్రామిక ప్రగతిని చూసి ఓర్వలేకే ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. కొత్తగా ప్రారంభమైన ఈ ప్లాంట్‌లో అత్యాధునిక సాంకేతికతతో క్యాన్సర్ చికిత్సకు అవసరమైన ఓరల్ ఆంకాలజీ ఔషధాలు, స్టెరిలైజ్డ్ ఇంజెక్టబుల్స్, లైయోఫిలైజ్డ్ పౌడర్ ఇంజెక్షన్లు, సాఫ్ట్ జెల్ క్యాప్సూల్స్ తయారు చేయనున్నట్లు తెలిపారు. ఈ పరిశ్రమ ద్వారా ప్రారంభ దశలో 500 మందికి ప్రత్యక్ష ఉపాధి లభించనుండగా, భవిష్యత్తులో ఈ సంఖ్య మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టు తెలంగాణను గ్లోబల్ లైఫ్ సైన్సెస్ హబ్‌గా మరింత బలోపేతం చేస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కంపెనీ ప్రతినిధులు డా. గోవింద రెడ్డి, డా. మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఎన్‌ఆర్‌ఈజీఎస్ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ

### చెక్కులు అందజేసిన మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్

**పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూలై 06:**

మంథని మండలం పుట్టపాక గ్రామపంచాయతీలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎన్‌ఆర్‌ఈజీఎస్) కింద క్యాపిటల్ షెడ్ నిర్మించుకున్న లబ్ధిదారులకు సోమవారం చెక్కులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్, గ్రామ సర్పంచ్ కన్నూరి రాజబాబు, ఉప సర్పంచ్ ఎడ్ల శ్రవణ్ కుమార్ లబ్ధిదారులకు చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా లబ్ధిదారులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా మరింత అభివృద్ధి చెందాలని వారు సూచించారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు కన్నూరి సుదర్శన్, ఫీల్డ్ అసిస్టెంట్ ప్రవీణ్ కుమార్, గ్రామ పెద్దలు చాట్లపల్లి రాజయ్య, కొమురయ్య, కొత్త రవి, కొత్త సదయ్య, కోరవేణి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## రైల్వే ట్రాక్‌పై వ్యక్తి ప్రాణాలు కాపాడిన కానిస్టేబుళ్లు.. ఎస్పీ ప్రశంసలు, నగదు రివార్డు..

**అర్జున్ సమాచారం జులై 6 జగిత్యాల ప్రతినిధి ::**

జగిత్యాల జిల్లాలో విధి నిర్వహణలో అప్రమత్తత, మానవీయ దృక్పథంతో వ్యవహరించిన ఇద్దరు





కానిస్టేబుళ్లను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అభినందించారు. మల్యాల పోలీస్ స్టేషన్‌కు చెందిన బ్లూ కోల్ట్స్ కానిస్టేబుళ్లు మధుసూదన్ రెడ్డి, వేణు రైల్వే ట్రాక్‌పై ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తిని సకాలంలో గుర్తించి ప్రాణాలను కాపాడారు. వారి సేవలను గుర్తించిన జిల్లా ఎస్పీ నగదు రివార్డును ప్రకటించి అభినందించారు. అత్యవసర పరిస్థితుల్లో సమయస్ఫూర్తితో స్పందించడం, మానవత్వంతో వ్యవహరించడం ప్రతి పోలీసు సిబ్బందికి ఆదర్శంగా నిలవాలని ఈ సందర్భంగా ఎస్పీ సూచించారు.

PRGI NO: TGTEL/25/A5514

అర్జున్ సమాచారం

www.arjunsamaachaaram.in


తెలుగు దినపత్రిక






# పవన్ ఫ్యాన్స్‌కు బర్త్‌డే ట్రీట్.. మళ్లీ థియేటర్లలోకి వస్తోన్న 'పంజా'!

తెలుగు సినీ పరిశ్రమలో రీ-రిలీజ్ ట్రెండ్ జోరుగా కొనసాగుతోంది. ఒకప్పుడు బాక్సాఫీస్ వద్ద సంచలన విజయాలు సాధించిన చిత్రాలతో పాటు, విడుదల సమయంలో ఆశించిన ఫలితం అందుకోలేకపోయినా తర్వాత కల్ట్ క్లాసిక్స్‌గా గుర్తింపు పొందిన సినిమాలను కూడా మళ్లీ ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. ముఖ్యంగా స్టార్ హీరోల అభిమానులు ఈ రీ-రిలీజ్‌లను పండుగలా సెలబ్రేట్ చేస్తుండటంతో థియేటర్లలో ప్రత్యేక వాతావరణం కనిపిస్తోంది. ఇప్పటికే పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ నటించిన పలు చిత్రాలు రీ-రిలీజ్ అయి మంచి ఆదరణ పొందాయి. ఇప్పుడు అదే జాబితాలో మరో స్టైలిష్ మూవీ 'పంజా' చేరబోతోంది. పవన్ అభిమానులకు ఇది మరో స్పెషల్ ట్రీట్‌గా మారనుంది. దర్శకుడు విష్ణువర్ధన్ తెరకెక్కించిన 'పంజా' 2011లో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. గ్యాంగ్‌స్టర్ యాక్షన్ డ్రామాగా రూపొందిన ఈ చిత్రం విడుదల సమయంలో ఆశించిన స్థాయి విజయాన్ని అందుకోకపోయినా, పవన్ కళ్యాణ్ కెరీర్‌లో అత్యంత స్టైలిష్ సినిమాల్లో ఒకటిగా ప్రత్యేక గుర్తింపు సంపాదించింది. సినిమాలో పవన్ లుక్, మేకోవర్, యాక్షన్ సన్నివేశాలు, విజువల్ స్టైల్ ఇప్పటికీ అభిమానులను ఆకట్టుకుంటూనే ఉన్నాయి. అలాగే ఈ చిత్రంలోని పాటలు, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ కూడా సంగీత ప్రియులను ఇప్పటికీ అలరిస్తుంటాయి. కాలం గడిచినా 'పంజా' ఆల్బమ్‌కు ఉన్న క్రేజ్ ఏమాత్రం తగ్గలేదు.



# అఖిల్‌కు కొత్త పేరు పెట్టిన అభిమాని..

। అక్కినేని యంగ్ హీరో అఖిల్ నటించిన తాజా చిత్రం 'లెనిన్' జూలై 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. దర్శకుడు మురళీ కిషోర్ అబ్బూరు తెరకెక్కించిన ఈ సినిమాపై ఇప్పటికే మంచి అంచనాలు నెలకొన్నాయి. విడుదల తేదీ దగ్గరపడుతున్న నేపథ్యంలో చిత్రబృందం ప్రమోషన్స్‌ను వేగవంతం చేసింది. ఇందులో భాగంగా తిరుపతిలో నిర్వహించిన ప్రీ-రిలీజ్ ఈవెంట్ అభిమానుల సందడితో ఎంతో వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో అఖిల్, నాగార్జున, చిత్రబృందం మాట్లాడిన విషయాలకంటే... ఓ అక్కినేని అభిమాని చేసిన వినూత్న ప్రయత్నమే అందరి దృష్టిని ఆకర్షించింది. అఖిల్‌కు కొత్త పేరును సూచిస్తూ అతడు చెప్పిన సెంటిమెంట్ ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సాధారణంగా సినీ ఇండస్ట్రీలో కొందరు హీరోలు కెరీర్ బాగా సాగాలని లేదా జ్యోతిష్య సూచనల మేరకు తమ పేర్లలో అక్షరాలు జోడించడం, మార్చుకోవడం చూస్తుంటాం.



# మిస్టీరియస్ కిల్లర్

స్వీయ దర్శకత్వంలో నటిస్తూ.. పద్మనాభరెడ్డితో కలిసి పూర్వాజ్ నిర్మించిన ఉమెన్ సెంట్రిక్ స్పై థ్రిల్లర్ 'కిల్లర్'. జ్యోతి పూర్వాజ్ కథానాయిక. నిర్మాణం పూర్తి చేసుకున్న ఈ చిత్రం త్వరలోనే విడుదల కానుంది. ఆదివారం హీరోయిన్ జ్యోతి పూర్వాజ్ పుట్టినరోజు. ఈ సందర్భంగా ఆమెకు శుభాకాంక్షలు తెలియజేస్తూ ఈ చిత్రం నుంచి ఓ స్పెషల్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. సూపర్, మిస్టీరియస్ ఉమెన్‌గా కనిపిస్తున్న జ్యోతి పూర్వాజ్‌ని ఈ పోస్టర్‌లో చూడొచ్చు. ఇందులో జ్యోతి పూర్వాజ్ సూపర్ షీగా కనిపించనున్నదని, ఓ వినూత్న ప్రపంచాన్ని ఈ చిత్రం ఆవిష్కరిస్తుందని, సెన్సార్ కార్యక్రమాలు పూర్తి చేసి త్వరలోనే సినిమాను విడుదల చేస్తామని మేకర్స్ తెలిపారు. మనీష్ గిలాడ, చంద్రకాంత్ కొల్లు, విశాల్ రాజ్, అర్చన అనంత్, గౌతమ్ చక్రధర్ కొప్పిశెట్టి ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: జగదీశ్ బొమ్మిశెట్టి, సంగీతం: అశీర్వాద్, సుమన్ జీవ, సమర్పణ: ఉర్వీజ్ పూర్వాజ్.



# సకుటుంబ ఆనందాల వేళ..

మహేంద్రన్, అంబికా వాణి జంటగా నటించిన చిత్రం 'వసుదేవసుతం' వైకుంఠ్ బోను దర్శకుడు. ధనలక్ష్మి బాదర్ల నిర్మాత. జూలై 10న సినిమా విడుదల కానున్నది. మ్యూజికల్ ప్రమోషన్స్‌లో భాగంగా ఆదివారం ఈ సినిమా నుంచి పాట విడుదల చేశారు. 'ఆనందాల వేళ..' అంటూ సాగే ఈ పాటను ఆది సాయికుమార్ ఆవిష్కరించి, చిత్రబృందానికి శుభాకాంక్షలు అందించారు. చైతన్య ప్రసాద్ రాసిన ఈ పాటను, మణిశర్మ స్వరపరచగా, సాయిచరణ్ భాస్కరుని, శృతిక సముద్రాల ఆలపించారు. కుటుంబ ఆనందోత్సాహాల నేపథ్యంలో ఈ పాట సాగింది. ఇదొక ఫ్యామిలీ ఎంటర్‌టైనర్ అని ఈ పాట చెబుతున్నది. జాన్ విజయ్, మైమ్ గోపి, సురేష్‌చంద్ర మీనన్, ఈశ్వర్య లక్ష్మి, తులసి తదితరులు ఇతర పాత్రలు పోషించిన ఈ చిత్రానికి కెమెరా: జిజ్జు సన్ని, నిర్మాణం: రెయిన్‌బో సినిమాస్.



# అలా అనడంతో మనసు బాధపడ్డా

సినీరంగంలో పురుషాధిక్యతపై తాజా ఇంటర్వ్యూలో బాలీవుడ్ భామ కృతిసనన్ చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. కెరీర్ తొలినాళ్లలో ఎదురైన చేదు అనుభవాలను ఈ ఇంటర్వ్యూలో ఆమె గుర్తు చేసుకున్నది. 'సినిమాల గురించి తెలుసుకోవాలనే ఆసక్తి మొదట్నుంచీ నాకెక్కువే. ఫలానా సన్నివేశం ఇలా చేస్తే బావుంటుందని చెప్పాలనుంటుంది. కానీ ఇక్కడ హీరోయిన్లకు అంత సీన్ లేదు. ఓసారి ఓ దర్శకుడికి ఇలాగే సలహా ఇచ్చేందుకు ప్రయత్నించా. ఆయన ఇరిటేటవుతూ 'మరీ ఎక్కువగా ఆలోచిస్తున్నావ్.. చెప్పింది చెయ్' అన్నారు. నా మనసు చివుక్కుమన్నది. అదే సలహా హీరోలు ఇస్తే, 'ఆహా.. ఓహో..' అంటూ మెచ్చుకుంటారు. సినిమా ప్రమోషన్స్‌లో హీరోయిన్లు ఎక్కడెక్కడ పాల్గొనాలో కూడా ఇక్కడ హీరోలే నిర్ణయిస్తారు. నాకు ఎదురైన మరో చేదు అనుభవం ఇది. నాకంటూ నిర్ణయాధికారం లేనప్పుడు, ఆ ప్రమోషన్లేవో వారే చేసుకోవచ్చుకదా.. అనిపించి, నేను రానని గట్టిగా చెప్పేశాను. కానీ దర్శక,నిర్మాతలు బతిమాలడంతో తప్పక ప్రమోషన్స్‌లో పాల్గొన్నా. ప్రస్తుతం ప్రాధాన్యత లేని పాత్రల్లో నటించేందుకు హీరోయిన్లెవరూ ఇష్టపడటంలేదు. నచ్చిన పాత్రల్నే ఎంచుకుంటున్నారు. అయినా ఇక్కడ ఇంకా పురుషాధిక్యతే కొనసాగుతున్నది' అంటూ చెప్పుకొచ్చింది కృతి సనన్



## ప్రజావాణిలో దరఖాస్తుల వెల్లువ



పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూలై 06

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో పెద్ద ఎత్తున దరఖాస్తులు అందుతున్నాయి. ప్రజల నుంచి వచ్చిన వినతులను నిష్పక్షపాతంగా స్వీకరించి సంబంధిత శాఖలకు పంపిస్తూ పరిశీలన చేపడుతున్నట్లు మంథని రెవెన్యూ డివిజనల్ అధికారి సురేష్ తెలిపారు. ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికగా నిలుస్తోందని దరఖాస్తుదారులు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వం చేపట్టిన సాదా బైనామా దరఖాస్తుల పరిశీలనలో పట్టాదారుల పేర్లతో ఫోర్జరీ సంతకాలు చేసి దరఖాస్తులు సమర్పిస్తున్న ఘటనలను క్షుణ్ణంగా విచారించి నిజమైన పట్టాదారులకు న్యాయం చేయాలని పలువురు ప్రజావాణిలో వినతిపత్రాలు అందజేస్తున్నారు. ఈ సందర్భంగా మంథని మండలం బిట్టుపల్లి, జిల్లెల్లపల్లి గ్రామ శివారులోని సర్వే నంబర్ 56లో గల 3 ఎకరాల 3 గుంటల భూమికి సంబంధించి ఫోర్జరీ సంతకాలతో సాదా బైనామా దరఖాస్తు సమర్పించారని ఆరోపిస్తూ, ఆ దరఖాస్తును నిలిపివేయాలని కోరుతూ మహావాది సరోజినీదేవి కుమారుడు సతీష్ కుమార్ ఆధారాలతో సహా ప్రజావాణిలో వినతిపత్రం సమర్పించారు. అలాగే బిట్టుపల్లి గ్రామ శివారులోని సర్వే నంబర్ 68/1లోని 5 ఎకరాల 17 గుంటలు, 68/2లోని 4 గుంటల భూములకు సంబంధించిన పూర్తి ఆధారాలను కూడా అధికారులకు సమర్పించినట్లు సతీష్ కుమార్ తెలిపారు.

## శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆశీస్సులతో రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులతో జీవించాలి: మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు

పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూలై 06



జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం ధన్వాడ గ్రామంలోని శ్రీ రేణుక ఎల్లమ్మ దేవాలయంలో ఘనంగా నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవంలో తెలంగాణ రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్న మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు రాష్ట్ర ప్రజలందరూ సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో జీవించాలని శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లిని ప్రార్థించారు. అనంతరం



మాట్లాడుతూ, దేవాలయాలు ఆధ్యాత్మిక చైతన్యానికి కేంద్రాలుగా నిలుస్తాయని, ప్రజల్లో ఐకమత్యం, సోదరభావం, మానవతా విలువలను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ధన్వాడ గ్రామ ప్రజలు ఐక్యంగా కలిసి దేవాలయ అభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమని అన్నారు. శ్రీ రేణుక ఎల్లమ్మ తల్లి ఆశీస్సులతో రాష్ట్రంలోని ప్రతి కుటుంబం సుఖసంతోషాలతో ఉండాలని, రైతులు పంటలతో సుభిక్షంగా ఉండాలని, యువతకు మంచి అవకాశాలు లభించాలని, తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. అనంతరం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చేతుల మీదుగా ఆడపడుచులకు చీరలను పంపిణీ చేశారు.

## కార్యకర్త సమ్మరాజును అభినందించిన కేటీఆర్

పోరాడే కార్యకర్తకు బీఆర్ఎస్ అండగా ఉంటుంది

పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూలై 06

మంథని నియోజకవర్గంలోని అన్నారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ కార్యకర్త సమ్మరాజును బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సోమవారం కలిసి అభినందించారు. కన్నెపల్లి పర్యటనకు వచ్చిన సందర్భంగా మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్‌తో కలిసి సమ్మరాజును కలిసి మాట్లాడారు. ఇటీవల కాంగ్రెస్ పార్టీలో చేరాలని స్థానిక నాయకులు ఒత్తిడి తీసుకొచ్చినప్పటికీ, తాను జీవితాంతం బీఆర్ఎస్ పార్టీలోనే కొనసాగుతానని సమ్మరాజు స్పష్టం చేసినట్లు తెలిసింది. ఆయన పార్టీ పట్ల చూపిన నిబద్ధతను అభినందిస్తూ కేటీఆర్ ప్రత్యేకంగా కలిసి మాట్లాడారు. ఈ సందర్భంగా



కేటీఆర్ మాట్లాడుతూ, పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలకు బీఆర్ఎస్ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. రాబోయే రోజుల్లో పార్టీ బలోపేతంలో కార్యకర్తలే కీలక పాత్ర పోషిస్తారని పేర్కొంటూ సమ్మరాజును అభినందించారు. మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ కూడా సమ్మరాజు పార్టీ పట్ల చూపిన నిబద్ధతను ప్రశంసించారు.

# పన్నూర్‌లో ఘనంగా వన మహోత్సవం



పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూలై 06



వన మహోత్సవాన్ని పురస్కరించుకుని రామగిరి మండలం పన్నూర్ గ్రామపంచాయతీ ఆవరణలో సోమవారం సర్పంచ్ చిందం మహేష్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మండల ఎంపీడీఓ శైలజ రాణి పంచాయతీ ఆవరణలో మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పెరుగుతున్న కాలుష్యాన్ని నియంత్రించి భావితరాలకు స్వచ్ఛమైన వాతావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. సర్పంచ్ చిందం మహేష్ మాట్లాడుతూ, వన మహోత్సవం వంటి కార్యక్రమాలు పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో మరింత అవగాహన పెంపొందిస్తాయని అన్నారు. గ్రామంలోని ప్రతి కుటుంబం కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించడం తమ బాధ్యతగా భావించాలని గ్రామస్తులకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రామగిరి ఈసీ మౌనిక, టీఏ అఖిల, పన్నూర్ గ్రామపంచాయతీ కార్యదర్శి ప్రేమలత, వార్డు సభ్యులు ప్రదీప్, అరుణ, పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ముత్తారం మండలంలో గ్రంథాలయాల ఏర్పాటుకు స్థలాల పరిశీలన



పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూలై 06

ముత్తారం మండలంలోని ముత్తారం గ్రామం, దర్యాపూర్ గ్రామంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో గ్రంథాలయాల ఏర్పాటు కోసం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్ సోమవారం పర్యటించి స్థలాలను పరిశీలించారు. తెలంగాణ ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు ఆదేశాల మేరకు ఈ పర్యటన నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. గ్రంథాలయాల ఏర్పాటుకు అనువైన స్థలాలను పరిశీలించి, అవసరమైన సౌకర్యాలపై సంబంధిత అధికారులతో చర్చించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు చొప్పరి సదానందం, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు దొడ్డ బాలాజీ, సీనియర్ నాయకుడు జగన్ మోహన్ రావు, డీసీసీ కార్యదర్శి అంబటి చంద్రమొగిలి, డీసీసీ ఎగ్జిక్యూటివ్ సభ్యుడు తాళ్లపల్లి కుమార్, ఏఎంసీ వైస్ చైర్మన్ మద్దెల రాజయ్య, మండల సర్పంచుల ఫోరం అధ్యక్షుడు బియ్యాని శివకుమార్, స్థానిక సర్పంచ్ రాపెల్లి రాజయ్య, మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు బక్కతట్ల వినీత్, వివిధ గ్రామాల సర్పంచులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## నూతన బాధ్యతలు చేపట్టిన బద్రి దేవేందర్ పటేల్

పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూలై 06



కమాన్‌పూర్ మండల కేంద్రానికి చెందిన బద్రి దేవేందర్ పటేల్ భారతీయ జనతా పార్టీ తెలంగాణ కార్మిక విభాగ రాష్ట్ర జాయింట్ కన్వీనర్‌గా నియమితులయ్యారు. ఈ సందర్భంగా బీజేపీ తెలంగాణ కార్మిక విభాగ రాష్ట్ర కన్వీనర్ అందె శ్రీనివాస్ చేతుల మీదుగా, బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు సమక్షంలో ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా బద్రి దేవేందర్ పటేల్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి కీలక బాధ్యతను అప్పగించిన పార్టీ అగ్రనాయకత్వానికి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి కార్మికుల సంక్షేమం, పార్టీ బలోపేతం, ప్రజాసేవ కోసం మరింత అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు. ఈ నియామకానికి సహకరించి తనను ప్రోత్సహించిన కేంద్ర బొగ్గు మరియు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి, బండి సంజయ్ కుమార్, మురళీధర్ రావు, పార్టీ రాష్ట్ర, జాతీయ నాయకత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అలాగే పెద్దపల్లి జిల్లా బీజేపీ అధ్యక్షుడు కర్ర సంజీవ రెడ్డి, జిల్లా, మండల, శక్తికేంద్ర, బూత్ స్థాయి నాయకులు, కార్యకర్తలు, తనకు శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. భారతీయ జనతా పార్టీ ఆశయాలను ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లేందుకు, కార్మికుల సమస్యల పరిష్కారానికి, పార్టీ అభివృద్ధికి పూర్తి నిబద్ధతతో కృషి చేస్తానని బద్రి దేవేందర్ పటేల్ తెలిపారు.

## జూలపల్లిలో ఉచిత వైద్య శిబిరానికి భారీ స్పందన

పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూలై 06

కమాన్‌పూర్ మండలం జూలపల్లి గ్రామంలో కరీంనగర్‌కు చెందిన అపోలో రీచ్ ఆసుపత్రి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. గ్రామ సర్పంచ్ పోల్దాసరి వనిత సాయికుమార్ శిబిరాన్ని ప్రారంభించారు. శిబిరంలో మొత్తం 105 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. బీపీ, షుగర్, ఈసీజీతో పాటు ఇతర ఆరోగ్య పరీక్షలు చేసి, అవసరమైన వారికి వైద్యుల సూచనల మేరకు ఉచితంగా మందులను పంపిణీ చేశారు.



ఈ కార్యక్రమంలో న్యూరో ఫిజీషియన్ డాక్టర్ ఎన్నం హరికృష్ణ, జనరల్ ఫిజీషియన్ డాక్టర్ చంద్రశేఖర్, ఇన్‌చార్జి డాక్టర్ హర్షిత, డైటీషియన్ డాక్టర్ ప్రణయ్, మేనేజర్ సదానందం, హసన్ అలీ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలి: చందుపట్ల సునీల్ రెడ్డి



పెద్దపల్లి ప్రతినిధి, అర్జున్ సమాచార్, జూలై 06:

కమాన్‌పూర్ మండలం పేరపల్లి గ్రామంలో సోమవారం బీజేపీ మండల అధ్యక్షుడు కొయ్యడ సతీష్ యాదవ్ ఆధ్వర్యంలో బూత్ స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, మాజీ జిల్లా అధ్యక్షుడు, మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి చందుపట్ల సునీల్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా చందుపట్ల సునీల్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ గ్రామాన భారతీయ జనతా పార్టీని బలోపేతం చేసే బాధ్యత ప్రతి కార్యకర్తపై ఉందన్నారు. పార్టీని బూత్ స్థాయి నుంచి మరింత పటిష్ఠం చేయాలని, కార్యకర్తలు ప్రతిరోజూ పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనడంతో పాటు సామాజిక మాధ్యమాల్లో కూడా చురుకుగా ఉండాలని సూచించారు. రానున్న రోజుల్లో మంథని నియోజకవర్గంలో బీజేపీ జెండా ఎగరడం ఖాయమని, ప్రతి కార్యకర్త పార్టీని భుజాన వేసుకుని పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలపై ప్రజలకు నమ్మకం తగ్గిందని, ప్రత్యామ్నాయంగా ప్రజలు బీజేపీ వైపు చూస్తున్నారని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త అంకితభావంతో పనిచేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు కొయ్యడ సతీష్ యాదవ్, సీనియర్ నాయకులు మట్ట శంకర్, అరుణ్ కుమార్, జనరల్ సెక్రటరీ విశ్వతేజ, ఉపాధ్యక్షులు కొమ్ము శ్రీనివాస్, బుద్ధార్థి శ్రీనివాస్, మండల కార్యదర్శి అగ్గి శ్రావణ్, రాజేష్, హరీష్, బొట్టు శ్రీనివాస్, లక్ష్మణ్, వివేక్, లోకేష్, వినోద్, బాలకృష్ణ, సత్యనారాయణ, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి లో 'గ్రీన్ డ్రైవ్ ఫర్ భీమారం'

భీమారం(మంచిర్యాల) ,అర్జున్ సమాచారం, జూలై 6, 2026

భీమారం గ్రామంలో పర్యావరణ పరిరక్షణ కోసం, స్థానిక యువకులు సోమవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజావాణి అధికారికి వినతిపత్రం అందజేశారు. పెరుగుతున్న వేసవి ఉష్ణోగ్రతలను అదుపు చేయడానికి మరియు గ్రామంలో పచ్చదనాన్ని పెంచడానికి ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని వారు కోరారు. జాతీయ రహదారి విస్తరణలో భాగంగా పెద్ద పెద్ద వృక్షాలను తొలగించడం వల్ల భీమారం ప్రాంతంలో ఉష్ణోగ్రతలు పెరిగాయని యువకులు ఆందోళన వ్యక్తం చేశారు. దీనికి పరిష్కారంగా "గ్రీన్‌డ్రైవ్ ఫర్ భీమారం" అనే కార్యక్రమాన్ని ఈ వర్షాకాలంలో చేపట్టాలని వారు ప్రతిపాదించారు. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ సహకారం అదించాలని కోరారు. గ్రీన్‌డ్రైవ్ ఫర్ భీమారం లో భాగంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటడం, స్థానిక వ్యాపారులను భాగస్వామ్యం చేస్తూ, ఒక పూట స్వచ్ఛందంగా బంద్ పాటించి వ్యాపారుల



సహకారంతో ప్రజలందరూ పాల్గొనేలా ఈ కార్యక్రమం లో పాల్గొనేల ప్రోత్సహించడం, గల్లీలోనూ ప్లాస్టిక్ రహిత పర్యావరణం గురించి ప్రజలకు అవగాహన కల్పించడం జరుగుతుందని గ్రామ యువకులు అన్నారు. ఈ వినతి పత్రం అందజేసిన వారిలో రామల్ల రాజ్ కుమార్, కొక్కుల మహేష్, మాటేటి మహేష్, మెండె మల్లయ్య యాదవ్, మరియు వేములు అరుణ్ ఉన్నారు.

Printed, Published and Owned by LINGAM RAJAIAH, and Printed at Vijaya Lakshmi Printing Press , H.No.12-180, Gouthaminagar,Mancheria, Mancherial Telangana-504208, and Published at H.No.12-180, Gouthami-nagar,Mancheria,Mancherial Telangana-504208. Editor: LINGAM RAJAIAH. PRGI. No. TGTEL/25/A5314, lingamrajaiahmncl@gmail.com,8121319896.